ANN తెలుగు
Follow: @ANNTELUGU
27-09-2025
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 293 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి

- ప్రభుత్వం ఉత్తర్వులు.. సీఎం చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్
- అక్టోబర్ 1న తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ నూతన డీజీపీగా శివధర్ రెడ్డిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఉన్నారు శివధర్ రెడ్డి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ఇంటలిజెన్స్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. శివధర్ రెడ్డిని నియమిస్తూ ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 1వ తేదీన శివధర్ రెడ్డి తెలంగాణ డీజీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం డైరెక్టర్ జనరల్ (డీజీ) ర్యాంకులో 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ రవిగుప్తా, డా.సౌమ్యామిశ్రా (1994 బ్యాచ్ ఐపీఎస్), శిఖాగోయల్ (1994 బ్యాచ్ ఐపీఎస్), ఆప్టే వినాయక్ ప్రభాకర్ (1994 బ్యాచ్ ఐపీఎస్) కొనసాగుతున్నారు. వీరిలో రవిగుప్తా ఈ ఏడాది డిసెంబర్ 19న పదవీ విరమణ పొందనున్నారు.

మిగతా 2లో

టాప్ న్యూస్

### ఒక్కో మహిళ అకౌంట్‌లో రూ.10 వేలు

- బీహార్ ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ కొత్తపథకం
- ఢిల్లీ నుండి వర్చువల్ గా ప్రారంభం



02

### అరబిందో ఫార్మా కంపెనీని తగలబెడతా..

- ఆదివారం ఉదయం 11 గంటల్లోగా కంపెనీ మూసేయాలి
- జడ్చర్ల ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



02

### స్మగుల్డ్ చేసిన కార్లలో కారు పార్టీ నడుస్తోందా?

- బసరత్ ఖాన్ కారుకు, కేటీఆర్‌కు లింకులపై దర్యాప్తు చేయాలి
- కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన ఆరోపణలు



02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,14,440 |
| 22 క్యారెట్ | 1,04,900 |
| సిల్వర్ (కేజీ) | 1,40,000 |


### బీర్ల ఐలయ్యపై మందుల సామేలు ఫైర్

నల్లగొండలో ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్యే అధికార పార్టీలో అలజడి

వివరాలు 2లో

# జూబ్లీహిల్స్ హీట్

**అభ్యర్థిని ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

- మాగంటి గోపినాథ్ సతీమణి సునీతకే టికెట్.. జూన్ లోనే చెప్పిన.. మహా పత్రిక
- కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ వైపు మొగ్గు.. షెడ్యూల్ నాడే ప్రకటించే అవకాశం
- జూబ్లీహిల్స్ పై కేటీఆర్, హరీశ్, అలీ, సబిత, పద్మారావులతో కేసీఆర్ కీలక సమావేశం





**హైదరాబాద్, మహా:**

జూబ్లీహిల్స్ రాజకీయాలు వేడెక్కాయి. షెడ్యూల్ కు గడువు సమీపించిన నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని బీఆర్ఎస్ ప్రకటించింది. ఇటీవల మృతిచెందిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకు టికెట్ కేటాయించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. దీంతో అభ్యర్థి పేరును పార్టీ వెల్లడించింది. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు.

మిగతా 2లో

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు

**చెప్పినట్లే.. జీవో విడుదల చేసిన రేవంత్ సర్కార్**

**నేడు సీఎస్, డిజిపితో ఎన్నికల సంఘం కీలక సమావేశం**

**ఈరోజు లేదా రేపు షెడ్యూల్ ప్రకటించే అవకాశం**

**హైదరాబాద్, మహా :**

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. ఈ దిశగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై బీసీ సంక్షేమశాఖ జీవోను(ప్రభుత్వ ఉత్తర్వులను) విడుదల చేసింది. డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సు మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కేటాయిస్తూ జీవో నంబర్ 9ను విడుదల చేసింది. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఎన్నికల సంఘం.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కీలక సమావేశం నిర్వహించనుంది.

మిగతా 2లో





### అక్టోబర్ నెలాఖరు కల్లా డీసీసీల నియామకం పూర్తి

- ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొనే నాయకులకే బాధ్యతలు: టీపీసీసీ చీఫ్
- ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేశ్ కుమార్ గౌడ్ భేటీ..
- తెలంగాణలో అమలవుతున్న పథకాలపై వివరణ



02



# జూబ్లిహిల్స్ హీట్

(మొదటిపేజీ తరువాయి)




ఆయన మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. జూబ్లిహిల్స్ అభ్యర్థిగా మాగంటి సునితను ఖరారుచేయబోతున్నారంటూ జూన్ లోనే మహా పత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఇక కాంగ్రెస్ బైపోల్ లో ఈ సీటును కైవసం చేసుకునేందుకు ముందునుండీ వ్యూహరచన చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. మంత్రులు పొన్నంప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ లను ఇన్ ఛార్జిగా నియమించి, బస్తీలు.. వాడలకు నిధులు కేటాయించి భరోసానిస్తున్నారు. ఇక అభ్యర్థిగా అనేకమంది పేర్లు పరిశీలన జరిపినా, స్థానిక నేత నవీన్ యాదవ్ వైపే మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. బీసీ, స్థానిక పట్టు నేపథ్యంలో హైకమాండ్ నవీన్ యాదవ్ పట్ల సానుకూలంగా ఉంది. దానం నాగేందర్, బొంతు రామ్మోహన్, కంజర్ల విజయలక్ష్మి, సీఎన్ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్ ఇలా అనేక పేర్లు వినిపించినా, ఫైనల్ గా నవీన్ యాదవ్ అయితే గెలుపు ఈజీ అవుతుందని హైకమాండ్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. తుది సమీకరణలు పరిశీలించి హైకమాండ్ పేరు ఫైనల్ చేయనుంది. పీసీసీ చీఫ్ పార్టీ నేతలతో పలుమార్లు జూబ్లిహిల్స్ పై సమీక్షలు జరిపారు. ఇక బిజెపి జూబ్లిహిల్స్ పై అంత సీరియస్ గా ఫోకస్ పెట్టలేదు. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే నెలకొంది.

**కేసీఆర్ సమీక్ష**

త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయని, ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకొని విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అన్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్‌తోపాటు పలువురు నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రతి అంశం పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు అన్ని నివేదికలు చెబుతున్నాయని కేసీఆర్ అన్నారు. క్షేత్ర స్థాయిలో కిందిస్థాయి కార్యకర్తలను అప్రమత్తం చేసి తద్వారా ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్ని అప్రమత్తం చేయాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.



## స్మగుల్డ్ చేసిన కార్లలో కారు పార్టీ నడుస్తోందా?

- బసరత్ ఖాన్ కారుకు, కేటీఆర్‌కు లింకులపై దర్యాప్తు చేయాలి
- కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, మహా:** కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. లగ్జరీ కార్ల స్కామ్ కేసులో నిందితుడు బసరత్ ఖాన్‌పై ఈడీ కేసు నమోదు చేసి సోదాలు నిర్వహించడాన్ని బండి సంజయ్ స్వాగతించారు. లగ్జరీ కార్ల స్కామ్ కేసులో అహ్మదాబాద్ డీఆర్ఐ అరెస్ట్ చేసిన.. ఈడీ కేసులో ఉన్న నిందితుడు బసరత్ ఖాన్ దిగుమతి చేసిన ల్యాండ్ క్రూయిజర్ కారులో ట్విట్టర్ టిల్లు కేటీఆర్ ఎందుకు తిరుగుతున్నాడు? అని బండి ప్రశ్నించారు. ల్యాండ్ క్రూయిజర్ కారుని కేటీఆర్ మార్కెట్ ప్రైస్‌కి కొన్నారా? అండర్ వాల్యూడ్ ధరకు కొన్నారా? కేసీఆర్ ఫ్యామిలీతో లింక్ ఉన్న కంపెనీల వాళ్ల పేరును కారు ఎందుకు రిజిస్టర్ అయ్యిందంటూ? ప్రశ్నలు సంధించారు. స్మగుల్డ్ చేసిన కార్లలో కారు పార్టీ నడుస్తోందా? నిజానిజాలు బయటకి రావాలని.. దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## భవిష్యత్తులో యూరియా సమస్య రానివ్వం

### రాష్ట్రానికి మరో 9674 మెట్రిక్ టన్నుల యూరియా

సెప్టెంబర్‌లో మెరుగైన యూరియా సరఫరా జరిగింది

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మహా:** సెప్టెంబర్ నెలలో రాష్ట్రానికి యూరియా సరఫరా గత నెలల కంటే మెరుగ్గా రావడం రైతులకు ఎంతో ఊరట కలిగించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు రాష్ట్రానికి మొత్తం 7.88 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందగా, వీటిలో ఒక్క సెప్టెంబర్ నెలలోనే 1.84 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా కావడం ముఖ్యమైన పరిణామమని తెలిపారు. గత నెలలో ప్రతి సారి కేటాయించిన యూరియా కంటే తక్కువగా సరఫరా అవడం వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందని, ఆయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పదే పదే కేంద్రాన్ని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడం వలన ఈ నెలలో అదనంగా యూరియా సరఫరా జరిగిందని అన్నారు. ఏప్రిల్ నెలలో 1.71 లక్షల మెట్రిక్ టన్నులకు 1.21, మే నెలలో 1.61 లక్షల మెట్రిక్ టన్నులకు 0.88, జూన్ నెలలో 1.70 లక్షల మెట్రిక్ టన్నులకు 0.98, జులై నెలలో 1.60 లక్షల మెట్రిక్ టన్నులకు 1.43, అగస్టు నెలలో 1.70 లక్షల మెట్రిక్ టన్నులకు 1.55 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయిన విషయాన్ని గుర్తు చేశారు. దిగుమతి టెండర్లలో ఆలస్యం, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా దిగుమతులపై ప్రతికూల ప్రభావం పడటం, దాని వల్ల కేంద్రం కూడా రాష్ట్రాలకు సరిపడా యూరియాను అందించలేకపోవడం రైతులను ఇబ్బందులకు గురి చేసిందని వివరించారు.

**రబీసీజన్ మొదటి 3 నెలల్లో 6 లక్షల మెట్రిక్ టన్నులకు..**

మరో రెండు రోజుల్లో 9674 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రానుందని తెలిపారు. ఈ యూరియా రైల్వే రేక్ పాయింట్లయిన వరంగల్, మంచిర్యాల, గద్వాల, కరీంనగర్, పందిళ్లపల్లి, జడ్చర్ల, తిమ్మాపూర్ ప్రాంతాలకు చేరుకుంటుందని, అక్కడి నుండి జిల్లాలకు సరఫరా అవుతుందని వివరించారు. అంతేకాక వివిధ కంపెనీల నుంచి మరో 34,700 మెట్రిక్ టన్నుల యూరియా రేక్ ప్లాన్ ఉందని, ఇది ఈ నెలాఖరు వరకు రాష్ట్రానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. రానున్న రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలో ప్రతి నెలకు 2 లక్షలకు తగ్గకుండా యూరియా సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరినట్టు మంత్రి తెలిపారు. రబీ సీజన్‌కు వాస్తవ ప్రణాళిక 10.40 లక్షల మెట్రిక్ టన్నులు అని, ఖరీఫ్ లో జరిగినట్టుగా రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఉండాలంటే రబీ సీజన్ మొదటి 3 నెలలలో 6 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గకుండా యూరియాను సరఫరా చేయాలని మంత్రి కోరారు. రైతుల అవసరాల దృష్ట్యా సరఫరా విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ఆప్టే వినాయక్ ప్రభాకర్ కేంద్ర సర్వీస్‌లో ఉన్నారు. సీవీ ఆనంద్, శిఖాగోయల్ శిఖాగోయల్ సైతం డీజీపీ రేసులో ఉన్నట్టు ప్రచారం జరిగింది.

**శివధర్ రెడ్డి ప్రస్థానం ఇదే..**

1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి శివధర్ రెడ్డి. హైదరాబాద్‌లో జన్మించిన శివధర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలేకలాన్ (పెద్దతుండ్ల) గ్రామానికి చెందినవారు. ప్రైమరీ స్కూల్ నుంచి ఉన్నత విద్య వరకు హైదరాబాద్‌లో చదువుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేసి కొంతకాలం అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత సివిల్ సర్వీసెస్ క్లియర్ చేసి 1994లో ఇండియన్ పోలీస్ సర్వీస్‌లోకి ప్రవేశించారు. ఏఎస్పీగా విశాఖపట్నంలోని అనకాపల్లి, నర్సీపట్నం, చింతపల్లిలో పని చేశారు. ఐక్యరాజ్యసమితి శాంతిపరిరక్షక దళంలో భాగంగా యునైటెడ్ నేషన్స్ మిషన్ ఇన్ కొసావోలో కూడా పని చేశారు. నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు ఎస్పీగా పనిచేస్తున్న సమయంలో అనేక సెన్సేషనల్ కేసులను పర్యవేక్షించారు. 2007లో మక్కా మసీదులో బాంబు పేలుళ్లు, పోలీసు కాల్పుల్లో 14 మంది చనిపోయిన సంఘటన తర్వాత హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా శివధర్ రెడ్డిని నియమించింది ప్రభుత్వం. అత్యంత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన ఆ సమయంలో అన్ని వర్గాల ప్రజల్లో ధైర్యం నింపి శాంతి భద్రతలను సమర్థంగా కాపాడారు శివధర్ రెడ్డి. విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో రోడ్ భద్రత కోసం అరైవ్ అలీవ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏసీబీ అడిషనల్ డైరెక్టర్‌గా, డైరెక్టర్‌గా పనిచేశారు. పర్సనల్ వింగ్‌లో ఐజీ, అడిషనల్ డీజీగా పని చేశారు. అడిషనల్ డీజీపీ రోడ్ సేఫ్టీ గానూ అనుభవం ఉంది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇంటెలిజెన్స్ చీఫ్‌గా మళ్లీ శివధర్ రెడ్డిని నియమించింది. ఆగస్టు 2024లో డీజీపీగా ప్రమోషన్ ఇచ్చింది. గ్యాలంట్రీ మెడల్, పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్, ఐక్యరాజ్యసమితి మెడల్‌తో సహా అనేక అవార్డులు శివధర్ రెడ్డి అందుకున్నారు.

## ఒక్కో మహిళ అకౌంట్‌లో రూ.10వేలు

బీహార్ ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ కొత్తపథకం

ఢిల్లీ నుండి వర్చువల్ గా ప్రారంభం

**ఢిల్లీ, మహా:** అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ నేడో, రేపో ప్రకటించనున్న వేళ.. మహారాష్ట్ర తరహాలో బీహార్ లోనూ సంచలన పథకానికి శ్రీకారం చుట్టారు. బీహార్‌లో మహిళా సాధికారిత కోసం జేడీయూ, ఎన్డీఏ డబుల్ ఇంజిన్ సర్కార్ కృషి చేస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. నితీశ్ కుమార్ ప్రభుత్వంలో మహిళలు సురక్షితంగా ఉన్నారని చెప్పారు. త్వరలోనే బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆ రాష్ట్రంలో ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. మహిళా సాధికారత, స్వయం ఉపాధి కల్పించేందుకు రూ.7,500 కోట్లతో రూపొందించిన ఈ పథకాన్ని ప్రధాని ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లోకి డబ్బు జమ కానుంది. అనంతరం మాట్లాడిన మోదీ గతంలో ఆర్‌జేడీ పాలనలో మహిళలు చాలా బాధలు పడ్డారని, వారికి రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. వారి పాలనలో శాంతి భద్రతలు దయనీయంగా ఉండేవని డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చాక పరిస్థితులు మెరుగుపడ్డాయని అన్నారు. బిహార్‌లో మరోసారి ఆర్‌జేడీ అధికారంలోకి రాకుండా చూసుకోవాలని మహిళలకు ప్రధాని కోరారు.

**మహిళలకు లబ్ధి**

"ఈ పథకం కింద ప్రతి కుటుంబంలోని ఒక మహిళకు, ఆమెకు నచ్చిన జీవనోపాధి కార్యకలాపాల కోసం ఆర్థిక సాయం అందిస్తారు. దీని వల్ల ఆమెకు సామాజిక సాధికారత, ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తాయి. ఈ స్కీమ్‌లో మొదటగా ప్రతి లబ్ధిదారుకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ కింద రూ.10వేలు అందిస్తారు. తదుపరి దశల్లో వారు రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం పొందే అవకాశం ఉంటుంది. వ్యవసాయం, పశుపోషణ, హస్తకళలు, టైలరింగ్, నేత, చిన్న తరహా సంస్థలు వంటి ఎంపిక చేసిన రంగాల్లో, మహిళలకు ఆర్థిక సాయం అందిస్తారు. అంతేకాదు స్వయం సహాయక బృందాలకు అనుసంధానంగా పనిచేసే కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ల ద్వారా మహిళల ఆర్థిక కార్యకలాపాలకు సహాయ, సహకారాలు అందిస్తారు. అవసరమైన శిక్షణ కూడా కల్పిస్తారు. మరీ ముఖ్యంగా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెట్లో అమ్మడానికి, రాష్ట్రంలోని గ్రామీణ హాట్ బజార్లను మరింతగా అభివృద్ధి చేస్తారు." అని ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసింది.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశానికి సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సహా ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రావడంతో ఇక ఎన్నికల నగారా మోగడమే ఆలస్యమని తెలుస్తోంది. మరోవైపు ఇప్పటికే రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత ప్రణాళికను ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ విడుదల చేసింది. తెలంగాణలో 12,760 పంచాయతీలు, 1,12,534 వార్డులు, 565 జడ్పీటీసీలు, 5,763 ఎంపీటీసీ స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. అనంతరం పరోక్షంగా 565 మండల పరిషత్‌లు, 31 జిల్లా పరిషత్‌లకు ఛైర్‌పర్సన్ల ఎన్నికలను నిర్వహిస్తామని పేర్కొంది. గురువారం తమిళనాడు వెళ్ళిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో బీసీలకు 42శాతం, ఎస్సీ,ఎస్టీలకు 27శాతం రిజర్వేషన్లు అమలుచేస్తామని.. దీంతో మొత్తం 69 శాతం రిజర్వేషన్లు తమిళనాడు తరహాలో అమలుచేయబోతున్నామని చెప్పారు. ఒక్కరోజులోనే ఇందుకు సంబంధించిన జీవో అనూహ్యంగా విడుదల కావడంతో రాజకీయవర్గాల్లో అలజడి మొదలైంది. శనివారం కీలక సమావేశం నిర్వహించడంతో శనివారం సాయంత్రం లేదా ఆదివారం సాయంత్రం ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ చేసే అవకాశాలున్నాయి.

**దయచేసి కోర్టుకు వెళ్లొద్దు: మంత్రి పొన్నం రిక్వెస్ట్**

బీసీలకు ఇచ్చే 42 శాతం రిజర్వేషన్లపై దయచేసి కోర్టుకు వెళ్లొద్దని, అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇది ఏ వర్గానికి నష్టం చేయదని, ఎంతో మేలుచేసే జీవో అని మంత్రి అన్నారు.

## హైదరాబాద్ ను ప్రపంచ గోల్ఫర్లకు ప్రీమియర్ గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం



### మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, మహా :** అంతర్జాతీయ ఆటగాళ్లను ఆకర్షించడం వల్ల తెలంగాణ గాల్ఫ్ టూరిజం కేంద్రంగా ఎదగగల సామర్థ్యం ఉందని స్పష్టమవుతోందని, మరిన్ని మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి, హైదరాబాద్ ను ప్రపంచ గాల్ఫర్లకు ప్రీమియర్ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ టోర్నమెంట్ 2025 ముగింపు కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని.. ప్రసంగించారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించి, కొత్త భాగస్వామ్యాలను ఏర్పరిచి, మన పర్యాటక రంగాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని ప్రపంచ పర్యాటకులకు ఆత్మీయ ఆహ్వానం పలుకుతున్నామని, అంతర్జాతీయ స్థాయిలో గోల్ఫ్ టోర్నమెంట్‌లను హైదరాబాద్ వేదికగా నిర్వహించబోతున్నామని మంత్రి తెలిపారు

అనంతరం విజేత బంగ్లాదేశీ గోల్ఫర్ జమాల్ హుస్సేన్‌కు రూ.15 లక్షలు, రన్నరప్ అక్షయ శర్మకు రూ. 10 లక్షల ప్రైజ్‌మనీ అందజేశారు. విజేతలకు, టోర్నీలో పాల్గొన్న గోల్ఫర్లకు, ఈ ఈవెంట్‌ను విజయవంతం చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ అధ్యక్షుడు బీవీకే రాజు, పీజీటీఐ సీఈవో అనుదీప్ జైన్, పీజీటీఐ డైరెక్టర్ వికాస్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రొఫెషనల్ గోల్ఫర్స్, అమ్మెచ్యూర్ గోల్ఫర్స్, ఇండియా, చెక్ రిపబ్లిక్, శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ లోని ప్రముఖ అంతర్జాతీయ గోల్ఫర్స్ పాల్గొన్నారు.




## బీర్ల ఐలయ్యపై మందుల సామేలు ఫైర్

నల్లగొండలో ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్యే

అధికార పార్టీలో అలజడి

**నల్లగొండ, మహా:** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ సంచలన ఆరోపణలు చేశారు. మదర్ డెయిరీ ఎన్నికల్లో తమ జిల్లాలో నేతలు కొందరు బీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నారని బీర్ల ఐలయ్యను ఉద్దేశించి ఆయన కామెంట్ చేశారు. తమ బంధుత్వాల కోసం కాంగ్రెస్ పార్టీని బలి చేయొద్దని ఫైర్ అయ్యారు. మదర్ డెయిరీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కానీ, గెలిస్తే.. నైతిక బాధ్యత వహిస్తూ బీర్ల ఐలయ్య తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కర్మకాలి కాంగ్రెస్ పార్టీ ఓడితే కార్యకర్తలే ఆయనకు బుద్ధి చెబుతారంటూ మందుల సామెల్ చేసిన వ్యాఖ్యలు అధికార పార్టీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కు ఫిర్యాదు చేయనున్నట్లు సామేలు చెప్పారు. మీడియా ముందే పీసీసీ చీఫ్ కు ఫోన్ చేసి ఫిర్యాదుచేశారు. సామేలు వ్యాఖ్యలు ఇప్పుడు ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారాయి. ఒకే జిల్లాకు చెందిన అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మరో ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేయడం హాట్ టాపిక్ గా మారింది. దీనిపై ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.



## అక్టోబర్ నెలాఖరు కల్లా డీసీసీల నియామకం పూర్తి

### ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొనే నాయకులకే బాధ్యతలు: టీపీసీసీ చీఫ్

ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేశ్ కుమార్ గౌడ్ భేటీ.. తెలంగాణలో అమలవుతున్న పథకాలపై వివరణ

**ఢిల్లీ:** డీసీసీ అధ్యక్షుల నియామకంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు. అక్టోబర్ నెలాఖరు వరకు తెలంగాణలో డీసీసీ అధ్యక్షుల నియామకాలు పూర్తవుతాయని తెలిపారు. జిల్లాల్లో సమర్ధవంతమైన నాయకత్వాన్ని రూపొందించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశించారని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొనే నాయకులకే బాధ్యతలు అప్పగించాలని ఖర్గే నిర్దేశించారన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, తీసుకుంటున్న ప్రజాహిత నిర్ణయాలను ఖర్గేకు తాను వివరించానని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. శుక్రవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశాను. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, తీసుకుంటున్న ప్రజాహిత నిర్ణయాలను వివరించాను.

**ఏ గ్రూపు ఒత్తిడికి లొంగకుండా పనిచేయాలి..**

అక్టోబర్ నెలాఖరు వరకు తెలంగాణలో డీసీసీ అధ్యక్షుల నియామకం పూర్తవుతుంది. జిల్లాల్లో సమర్ధవంతమైన నాయకత్వాన్ని రూపొందించాలని ఖర్గే ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొనే నాయకులకే బాధ్యతలు అప్పగించాలని ఖర్గే నిర్దేశించారు. సంస్థాగత పునర్నిర్మాణం పగడ్బందీగా, ఏ గ్రూపు ఒత్తిడికి లొంగకుండా పనిచేయాలన్నారు. అక్టోబర్ 4వ తేదీ నుంచి ఏఐసీసీ పరిశీలకులు అన్ని జిల్లాల్లో పర్యటిస్తారు. అక్టోబర్ 15వ తేదీ కల్లా ప్రతి జిల్లాకు డీసీసీ అధ్యక్ష పదవికి ఎంపిక చేసిన ఆరుగురు పేర్లను పరిశీలకులు సమర్పిస్తారు. అక్టోబర్ నెలాఖరు కల్లా డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ పూర్తవుతుంది' అని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు.

## అరబిందో ఫార్మా కంపెనీని తగలబెడతా

- ఆదివారం ఉదయం 11గంటల్లోగా కంపెనీ మూసేయాలి
- జడ్చర్ల ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

**జడ్చర్ల, మహా :** కాలుష్యం నీటిని బయటకు వదిలితే పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా కంపెనీని తగలబెడతానంటూ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో పోలేపల్లి సెజ్‌లోని శిల్ప, అరబిందో కంపెనీలు కాలుష్యాన్ని వెదజల్లుతున్న విషయాన్ని సభ దృష్టికి తీసుకెళ్లానని, అయినా ఇప్పటివరకు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీంతో సొంత ప్రభుత్వానికి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే మరోసారి హెచ్చరించారు. జడ్చర్ల ప్రాంతంలో ఉన్న అరబిందో ఫార్మా కంపెనీ కలుషిత నీరు వదులుతుందని, రైతుల పొలాలు దెబ్బతింటున్నాయని అనేక సార్లు ప్రభుత్వానికి, పొల్యూషన్ బోర్డుకు ఫిర్యాదు చేశానన్నారు. ఎందుకు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు? కంపెనీ యాజమాన్యంతో పొల్యూషన్ బోర్డు అధికారులు కుమ్మక్కయ్యారా? ఒక్కరోజు సమయం ఇస్తున్నాను, కంపెనీ మూసివేకపోతే ఆదివారం ఉదయం 11 గంటలకు అరబిందో ఫార్మా కంపెనీని తగలబెడతానని ఆయన హెచ్చరించారు.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు పెంపు

### మూడు నెలలు పొడిగిస్తూ సర్కార్ ఉత్తర్వులు

**హైదరాబాద్, మహా:** జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువును పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకే అక్రిడిటేషన్ల గడువు ముగియడంతో ప్రభుత్వం మూడు నెలలు పొడగించింది. ఆ గడవు సెప్టెంబర్ 30తో పూర్తి కావస్తుండటంతో మరో మూడు నెలలు పెంచుతున్నట్లు వెల్లడించింది. అక్టోబర్, 1, 2025 నుంచి డిసెంబర్, 30, 2025 వరకు పొడిగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నామన్న రెవెన్యూ మంత్రి

## దసరా పండుగ దృష్ట్యా ప్రజల రవాణాకు ఆటంకం కలగకుండా చర్యలు
## మూసీ పరివాహక ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
## భారీ వర్షాలపై కలెక్టర్లు, ఎస్పీలతో రెవెన్యూ మంత్రి పొంగులేటి టెలీ కాన్ఫరెన్స్



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లతో పాటు సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. భారీ వర్షాలపై సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు మంత్రి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ జితేందర్‌తో కలిసి కలెక్టర్లు, ఎస్పీలు, హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గడిచిన 24 గంటల్లో భారీ వర్షాలు కురిసిన ప్రధానంగా రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలు, వచ్చే 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఇరిగేషన్, రవాణా, విద్యుత్, హైడ్రా, జీహెచ్ఎంసీ, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పని చేసి జన జీవనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో అతిపెద్ద పండుగైన దసరాకు ముఖ్యంగా హైదరాబాద్ నగరం నుంచి ప్రజలు సొంత గ్రామాలకు వెళ్తారని, వారి రవాణాకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలని సూచించారు. వికారాబాద్ జిల్లాలో కురిసిన అతి భారీ వర్షాల వల్ల మూసీ నదిలోకి భారీ వరద వస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైనచోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే శివాజీ బ్రిడ్జీ కింద భూలక్ష్మి ఆలయం సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 55 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు వెల్లడించారు. మూసీ నదిలో నీటి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణలోనే ఉండాలని సూచించారు. ముఖ్యంగా హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలకు భారీ వరద వస్తున్నందున ముందు జాగ్రత్త చర్యగా వస్తున్న వరదను అంచనా వేసి అంతే పరిమాణంలో ఈ రెండు జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. రెండు జలాశయాల నుంచి నీటిని విడుదల చేసే సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైతే షెల్టర్ హోమ్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

ఇప్పటికే రాష్ట్రంలో చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండాయని, రాబోయే వర్షాల వల్ల చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా నీటి పారుదల శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి గారు సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే లోలెవెల్ కాజ్‌వేలు వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జలాశయాలు, జల వనరుల వద్ద సెల్ఫీలు దిగకుండా యువతను నివారించాలని సూచించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రెస్క్యూ ఆపరేషన్ టీమ్‌లను, అలాగే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు.

# ఓజీ చిత్ర బృందానికి షాక్

## టికెట్ ధర పెంపునకు నో చెప్పిన హైకోర్టు
## విచారణ అక్టోబర్ 9కి వాయిదా



**హైదరాబాద్, మహా :** ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన ఓజీ మూవీ టికెట్ల ధర పెంపుపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం మరోసారి విచారణ జరిగింది. హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులు కొనసాగించేలా న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. టికెట్ రేట్లు ఎందుకు పెంచాలనుకున్నారో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 9 కి వాయిదా వేసింది. అక్టోబర్ 9 వరకూ ఈ ఆదేశాలు కొనసాగుతాయని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఓజీ మూవీ టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో ఇచ్చిన సంగతి తెలిసిందే. ఓజీ ప్రీమియర్స్ షోతోపాటు, విడుదల తేదీ నుంచి వారం రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. సింగిల్ స్క్రీన్‌లో రూ.100, మల్టీప్లెక్స్‌లో రూ.150 వరకు టికెట్ ధరను పెంచుకునే అవకాశం కల్పించింది. దీన్ని సవాల్ చేస్తూ మహేష్ యాదవ్ అనే వ్యక్తి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

### టిక్కెట్ రేట్లపై కొంతమందికే అభ్యంతరం : న్యాయవాది

అంతకు ముందు పవన్ కల్యాణ్ హీరోగా రూపొందిన 'ఓజీ' సినిమా టిక్కెట్ ధరలపై హైకోర్టులో వాదనలు జరిగాయి. చిత్ర యూనిట్ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. సినిమా టిక్కెట్ ధరలపై కొద్దిమంది మాత్రమే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఆయన కోర్టుకు తెలియజేశారు. టిక్కెట్ ధరలపై అభ్యంతరం ఉన్న వారు సాధారణ ధరలు ఉన్నప్పుడే సినిమా చూడవచ్చన్నారు. 5స్టార్ హోటల్‌లో కాఫీ ధర రూ. 500 ఉంటుందని, గాయకుడు దిల్జీత్ ప్రదర్శన టిక్కెట్ ధర వేలల్లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆ ధరలను నిర్ణయించే అధికారం నిర్వాహకులకే ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ షో ఏర్పాటు చేయాలనుకుంటే, ఆయనకు నచ్చిన ధరను నిర్ణయిస్తారన్నారు. సినిమా టిక్కెట్ ధరలను మాత్రమే ప్రభుత్వం నియంత్రిస్తుందని ఆయన తెలిపారు. 'ఓజీ' చిత్రాన్ని ఢిల్లీలో చూడాలంటే టిక్కెట్ ధర రూ. 1,500 ఉంటుందని, అదేవిధంగా ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్ ధర కూడా రూ. 1,500 ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ ధరలు రూ. 200 ఉండాలని కోరుతూ పిటిషనర్ కోర్టుకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దిల్జిత్ షో టిక్కెట్ ధర రూ. 10 వేలు ఉంటే, దానిని రూ. 200కు తగ్గించాలని ఎందుకు పిటిషన్ వేయలేదని న్యాయవాది నిరంజన్ రెడ్డి కోర్టులో వాదించారు.

కేవలం సినిమా టిక్కెట్ ధరలపై మాత్రమే ఇలాంటి పిటిషన్‌లు వేస్తున్నారని ఆయన కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సినిమా టిక్కెట్ ధరల గురించి ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తే, రూ. 100, రూ. 150 వరకు పెంచుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని ఆయన తెలిపారు. పిటిషనర్‌కు రూ. 150 కూడా ఎక్కువ అనిపిస్తే, సాధారణ ధర ఉన్నప్పుడే సినిమా చూడవచ్చని పేర్కొన్నారు. పిటిషనర్ మొదటి రోజు, తమకు నచ్చిన ధరకే సినిమా చూడాలనుకుంటే ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు.



# ప్రభుత్వం కంటే ప్రజలే నాకు ముఖ్యం

- త్రిబుల్ ఆలైన్ మెంట్ పై రైతులకు వివరణ ఇవ్వాల్సిందే
- త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని రీజనల్ రింగ్ రోడ్ (త్రిబుల్ ఆర్) భూ నిర్వాసితులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సమస్యలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతులకు భూమితో భావోద్వేగ సంబంధం ఉంటుందని, ఆ బంధాన్ని గౌరవించాలని ఆయన అన్నారు. పార్టీ, ప్రభుత్వం కంటే ప్రజలే తనకు ముఖ్యమని, ప్రజల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ పనిచేస్తానని చెప్పారు. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు వల్ల భూ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు, రహదారి వెళ్లే దక్షిణ భాగంలోని నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో చర్చలు జరుపుతున్నట్లు కోమటిరెడ్డి తెలిపారు. ఈ సమస్యపై చాలా మంది ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అధికార పార్టీలో ఉన్నప్పటికీ తాను ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడతానని ఆయన స్పష్టం చేశారు. పదవి కిరీటం కాదని, అది ఒక బాధ్యత అని, ధర్మం, న్యాయం వైపు తాను ఎప్పుడూ ఉంటానని ఆయన అన్నారు. మునుగోడు నియోజకవర్గంలో సగం భాగం ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పరిధిలోకి వస్తుందని కోమటిరెడ్డి తెలిపారు. రహదారి అలైన్‌మెంట్ మార్పు విషయంలో రైతులకు సరైన వివరణ ఇచ్చి, వారిని ఒప్పించి నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతిపక్షాలు తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, కానీ తాము ప్రజల కోసం నిజాయితీగా పనిచేస్తామని ఆయన అన్నారు. ఆర్ఆర్ఆర్ వెళ్లే నియోజకవర్గాల ఎమ్మెల్యేలంతా కలిసి ముఖ్యమంత్రితో ఈ విషయమై చర్చిస్తామని కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.



# గిన్నీస్ రికార్డ్ బతుకమ్మను విజయవంతం చేయాలి

- ప్రతి ఆడబిడ్డ పాల్గొని బతుకమ్మ కీర్తిని ప్రపంచానికి చాటాలి
- మహిళా కాంగ్రెస్ సమావేశంలో మంత్రి సీతక్క

**హైదరాబాద్, మహా :** బతుకమ్మ సంబరాల్లో భాగంగా 29 వ తేదీన సరూర్ నగర్ స్టేడియంలో ప్రభుత్వం తలపెట్టిన గిన్నిస్ వరల్డ్ రికార్డు బతుకమ్మ కార్యక్రమంలో మహిళలు అంతా పాల్గొనాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. పదివేల మంది మహిళలతో బతుకమ్మను గిన్నిస్ రికార్డులుకు ఎక్కించే లక్ష్యంతో ప్రభుత్వ తరపున వేడుక నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం గాంధీభవన్ లో మహిళా కాంగ్రెస్ కార్యవర్గ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ, మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమగ్రంగా వివరించారు.

మహిళలకు హృదయపూర్వక బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన సీతక్క బతుకమ్మను పూలతో చెరువులను, ప్రకృతిని ఆరాధించే పండుగగా వర్ణిస్తూ, "దేవుడికి పువ్వులు ఇష్టము, అదే విధంగా మహిళలకి కూడా పూలు ఇష్టమే" అని అన్నారు. బతుకమ్మ పండగ తెలంగాణకు ప్రత్యేకమైన ఆస్తిత్వమని పేర్కొంటూ, ఈ పండుగకు సంబంధించిన సాంప్రదాయాలను, ఆరోగ్య ప్రయోజనాలను, చెరువుల పరిరక్షణలో బతుకమ్మ పాత్రను వివరించారు. బతుకమ్మ పూలైన తంగేడు, గునుగు, కట్ల వంటి పూలలో ఔషధ గుణాలు ఉండి చెరువుల నీటిని శుద్ధి చేయడంలో సహాయపడతాయని, బతుకమ్మ ఆచారంలో చెరువులకు కృతజ్ఞతా భావం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పల్లె జీవితానికి, మహిళల సంఘసంబంధానికి బతుకమ్మ ఎంతో కీలకం అని, బతుకమ్మ వేడుకలను సాంప్రదాయ పద్ధతిలోనే జరుపుకోవాలని సూచించారు. మహిళా సంక్షేమ కార్యక్రమాల్లో మహిళా కాంగ్రెస్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నట్టు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే కాకుండా మహిళలను బస్సు ఓనర్లుగా చేస్తున్నామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం మహిళల అభయ హస్తం పొదుపు సొమ్మును, రూ.3500 కోట్ల రూపాయల వడ్డీని ఎగ్గొటిందని గుర్తు చేశారు.

# ఆర్జేడీతో పొత్తుకు ఎంఐఎం తహతహ





- లాలూ ప్రసాద్ కు లేఖ రాసినట్టు ఒవైసీ వెల్లడి
- పొత్తులో భాగంగా ఆరు సీట్లు అడిగిన ఎంఐఎం
- హైదరాబాద్ లో ఆర్జేడీ పోటీ చేయాలని ఆహ్వానం

**న్యూఢిల్లీ, మహా :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)తో కలిసి పని చేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. పొత్తు ప్రతిపాదనపై తమ పార్టీ బీహార్ నాయకత్వం ఇప్పటికే ఆర్జేడీని సంప్రదించిందని, ఇప్పుడు నిర్ణయం వారి చేతుల్లోనే ఉందని ఆయన తెలిపారు. బీజేపీ, జేడీయూ కూటమిని ఎదుర్కోవాలంటే కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక జాతీయ ఛానల్ కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఒవైసీ, బీహార్‌లో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకూడదనే ఉద్దేశంతోనే లౌకికవాదాన్ని బలోపేతం చేసేందుకు ఈ ప్రతిపాదన చేశామన్నారు. "గతంలో మా పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలను మీ పార్టీ (ఆర్జేడీ) లాగేసుకున్నప్పటికీ, మేం పొత్తుకు ముందుకు వచ్చాం. మా బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్ స్వయంగా లాలూ ప్రసాద్ యాదవ్‌కు లేఖ రాశారు" అని ఒవైసీ వివరించారు. తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు. పొత్తులో భాగంగా తమకు ఆరు సీట్లు కేటాయించాలని కోరామని, గెలిస్తే మంత్రి పదవులు కాకుండా సీమాంచల్ అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని మాత్రమే డిమాండ్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తమ కంచుకోట అయిన హైదరాబాద్‌లో పోటీ చేసేందుకు ఆర్జేడీని ఆహ్వానిస్తున్నట్లు కూడా ఒవైసీ తెలిపారు.

ఇదే సమయంలో దేశంలోని పలు సమకాలీన అంశాలపై కూడా ఆయన ఘాటుగా స్పందించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గర్బా వేడుకల్లోకి ముస్లింల ప్రవేశాన్ని నిరాకరించడం ఒక రకమైన సామాజిక బహిష్కరణేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇటీవల కాన్పూర్‌లో 'ఐ లవ్ మహమ్మద్' పోస్టర్లపై చెలరేగిన వివాదాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. "ప్రేమను వ్యక్తం చేయడంలో తప్పేముంది? ఒకవేళ ఎవరైనా 'ఐ లవ్ మహదేవ్' అని రాస్తే దానితో కూడా సమస్య లేదు. అది వారి విశ్వాసం. కానీ ఇలాంటి చర్యల ద్వారా ముస్లింలను సామాజికంగా బహిష్కరించే ప్రయత్నం జరుగుతోంది" అని ఒవైసీ ఆరోపించారు.

# ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దు

- భారీ వర్ష సూచన.. కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి
- ఉన్నతాధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిస్థితులపై చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు ఆయా జిల్లాల్లో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రమాదకర పరిస్థితులు ఉన్న చోట ముందస్తు హెచ్చరికలతో ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తంగా ఉంచాలని, భారీగా నీరు చేరే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకునేలా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు.

# ఓటుకు నోటు కేసులో మత్తయ్యకు ఊరట





## సుప్రీంకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ, మహా :** ఓటుకు నోటు కేసు వ్యవహారంలో జరూసలేం మత్తయ్యకు ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ని సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జరూసలేం మత్తయ్యపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను తెలంగాణ హైకోర్టు గతంలో క్వాష్ చేసింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ కేసుపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టిపారేసింది. ఓటుకు నోటు కేసుకు సంబంధించి జరూసలేం మత్తయ్యపై 2016లో ఎఫ్ఐఆర్ నమోదు అయింది. ఈ ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఏసీబీ 2016 జులై 6వ తేదీన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు. ఈ కేసులో ఏ2గా ఉన్న సెబాస్టియన్, ఏ4 మత్తయ్యలు దాదాపుగా ఇరవై సార్లు ఫోన్లలో సంభాషించుకున్నారని కోర్టుకు తెలిపారు. దానిపై దర్యాప్తు జరగాల్సిన అవసరం ఏంతైనా ఉందని అన్నారు. మత్తయ్యను విచారించాల్సిన అవసరాన్ని పరిగణనలోకి తీసుకోకుండా హైకోర్టు కేసును కొట్టివేసిందని చెప్పారు. ఈ వాదనను మత్తయ్య తరపు న్యాయవాది ఖండించారు. ఆయన క్రైం సీన్‌లో లేరని, కేసులో ఇరికించారని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది. శుక్రవారం తుది తీర్పును వెలువరించింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. తెలంగాణ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను కొట్టి పారేసింది. దీంతో మత్తయ్యకు ఊరట లభించింది.


# ఉద్యోగావకాశం

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

**మహా పత్రిక**కు (RNI NO: APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

## స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM, 95501 59679, 90001 41919

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | స్పెషల్ స్టోరీ | SPECIAL STORY | శనివారం, హైదరాబాద్ | 27-09-2025
ANN తెలుగు

## ప్రతిదినం అన్నదానం..

# ప్రతిక్షణం ఆపన్నహస్తం







**ఒకే ఒక్కడు..**
**నిత్యాన్నదాత కంది శ్రీనివాస రెడ్డి**
**పేదల ఆకలి తీరుస్తున్న మానవతా మూర్తి**
**నిత్యం వందలాది మందికి భోజనం**
**ఆకలి తీర్చేందుకు ఒక వ్యవస్థ ఏర్పాటు**
**ఎంతో ఖర్చుతో నిత్యాన్న దాన కేంద్రం**
**షెడ్, నల్లాలు, ఫ్యాన్లు,**
**కూలింగ్ వాటర్ ఏర్పాటు**

**సత్యనారాయణ ,రీజనల్ కోఆర్డినేటర్**
**ఏఎన్ ఎన్ తెలుగు, ఆదిలాబాద్**



**ఆదిలాబాద్, మహా :** అన్నదానమంటే మహాదానం అని మన పురాణాలు చెబుతున్నాయి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కన్నా గొప్ప పుణ్యం ఇంకొకటి లేదు. అలాంటి మహత్తర సేవా గుణం కలిగిన ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ప్రతిరోజూ నిస్వార్థంగా గత నాలుగేళ్లుగా నిత్యాన్న దానాన్ని కొనసాగిస్తూ ఉన్నారు. ఆయన పేద రైతు కుటుంబం లో పుట్టి స్వయం కృషితో ఎదిగారు. పేదల కడుపు నింపాలన్న పెద్ద మనస్సుతో నాలుగేళ్ల కిందట చేపట్టిన నిత్యాన్నదాన కార్యక్రమం నిర్విరామంగా సాగుతోంది. అమెరికా నుండి ఆదిలాబాద్ కు వచ్చిన తర్వాత కేఎస్ఆర్ ఫౌండేషన్ ను స్థాపించి దాని ద్వారా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవా భవన్ లో ప్రతిరోజూ ఎంతోమంది ఆకలి తీర్చుతూ నిత్యాన్నదాత గా ప్రశంసలు అందుకుంటున్నారు. అన్నిదానాల్లో కెల్లా ఆకలి తీర్చే అన్నదానం గొప్పదన్న ఆలోచనతో ఇంత మంచి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ మహోన్నతమైన సేవా కార్యక్రమం ద్వారా ఎందరో పేదలు తమ ఆకలిని తీర్చుకుంటున్నారు.

### గొప్ప ఆలోచన

అన్నదాన పంపిణీ కేవలం ఆహార సరఫరా కాదు – అది మానవతా విలువల వికాసానికి ప్రతీక. కంది శ్రీనివాస రెడ్డి ఇది ఒక బాధ్యత గా కాక, ఒక ఆత్మీయ కర్తవ్యంగా భావించి కొనసాగిస్తుండటం ఎంతో హర్షణీయము. అతని సేవా మనోభావం, సమాజం పట్ల ఉన్న ప్రేమ, తన సంపదను ఇతరులతో పంచుకోవాలనే దృక్పథం ఎందరికోఆదర్శంగా నిలుస్తోంది. నిస్వార్థంగా పేదలకు, ఆకలితో అలమటిస్తున్నవారికి ఉచితంగా అన్నదానం చేస్తూ, మానవతా విలువలను చాటుతున్నారు..అన్నం పెట్టడమంటే కేవలం ఏదో ఓ ముద్ద ఇచ్చినట్టు కాదు గుండె నిండా మంచి సంకల్పంతో తన నిత్యాన్నదాన కేంద్రంలోనే ఒక వ్యవస్థను ఏర్పరచి నడిపిస్తున్న మహాను భావుడు కంది శ్రీనివాస రెడ్డి. ఆకలి తీర్చుకోవడానికి వచ్చిన వారికి శుభ్రమైన ప్లేట్లు , చేతులు కడుక్కోవడానికి నల్లాలు, త్రాగడానికి కూలింగ్ వాటర్ ఫ్యాన్లు అమర్చిన షెడ్డుకింద భోజనం ఇంతలా పేదలను అపురూపంగా చూసుకుంటున్నారు కాబట్టే ప్రతీ రోజు ఒంటిగంట నుండే నిత్యాన్న దాన కేంద్రం వద్దకు పేదలు వందల సంఖ్యలో తరలి వస్తారు.

### మాటల్లో వినయం చేతల్లో ప్రేమ

వినయంగా మాట్లాడే నేత, నిత్యం ప్రజల మధ్యే తిరిగే నేత, అన్నదానంతో ఆకలితో ఉన్నవారికి భరోసా ఇచ్చే నేత ఈ మూడు లక్షణాలకూ నిజమైన చిరునామా కంది శ్రీనివాస రెడ్డి శ్రీనన్న అని ప్రజలు ప్రేమగా పిలుచుకునే కంది శ్రీనివాస రెడ్డి గత నాలుగేళ్లుగా నిరంతరంగా నిత్యాన్నదానం చేస్తూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఎదురైనా, ఆయన సేవా యాత్ర మాత్రం ఆగలేదు. అన్నదానం ఒక బాధ్యత కాదు, తన శ్వాస అని ప్రాణం ఉన్నంత వరకు అన్నదానాన్ని కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు.కంది శ్రీనివాస రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నిత్యాన్నదాన కార్యక్రమం ద్వారా ప్రతి రోజూ వందలాది మంది ఆకలిని తీర్చుకుంటున్నారు. రిమ్స్ రోగుల సహాయకులు, చిన్నచిన్న పనులు చేసే కార్మికులు, ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, దినసరి కూలీలు, ఆదిలాబాద్ కు వివిధ పనులపై వచ్చేవాళ్లు , పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ,యాచకులు ఇలా జీవితంలోని వివిధ స్థాయిలలో ఉన్న ప్రజలు ఈ నిత్యాన్నదానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

### అదే నా అభిమతం

తనకు దేవుడిచ్చిన భాగ్యంలో కొంత ఇతరులతో పంచుకోవాలన్నది తన అభిమతంగా కంది శ్రీనివాస రెడ్డి చెబుతుంటారు. తను సంపాందించిన ఆస్తిలో సగం పేదలకే ఖర్చు పెడతానని ఆయన స్పష్టం చేసారు. పేదల ఆకలిని తీర్చడం తన భాగ్యమని, అలాంటి శక్తిని భగవంతుడు తనకిచ్చినందుకు ధన్యుడిని అని ఆయన చెప్పారు.ఆహార నాణ్యతపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, రుచికరమైన, శుద్ధమైన భోజనాన్ని అందిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమం ఆదిలాబాద్ జిల్లాలో ఆదర్శంగా నిలుస్తోంది. జిల్లావ్యాప్తంగా ఆయన సేవలను ప్రజలు హృదయపూర్వకంగా ప్రశంసిస్తున్నారు. ఇటీవలి రోజుల్లో స్వార్థం పెరుగుతున్న తరుణంలో, మానవతా స్ఫూర్తిని నిలబెట్టిన ఈ సేవా మార్గదర్శకుడు మరెందరికో ప్రేరణగా నిలుస్తున్నారు. ఒక మంచి ఆలోచనతో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కంది శ్రీనివాస రెడ్డిని జిల్లా ప్రజలు నిండు మనస్సుతో అభినందిస్తున్నారు.



# పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత

**కమిషనర్ సుమన్ రావు**

**రాజేంద్రనగర్, మహా ;** పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత అని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు అన్నారు. శంషాబాద్ మున్సిపల్ పరిధిలో స్వచ్ఛతాహి సేవ 2025లో ఏక్ దిన్ ఏక్ గంట ఏక్తా ప్రోగ్రాం లో భాగంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి సామూహిక క్లినిక్ డ్రైవ్ చేపట్టారు. శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ లో పురపాలక ఉద్యోగులు సిబ్బంది చీపుర్లు పట్టి చెత్త తో పాటు వ్యర్థాలను తొలగించారు. కమిషనర్ సుమన్ రావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించాలన్నారు. అపరిశుభ్రంగా ఉండడం వల్ల మనం ఎన్నో అనారోగ్యాలకు గురవుతామన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి ఎలాంటి వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్, రాములు, జూనియర్ అసిస్టెంట్, అనిల్ కుమార్, బిల్ కలెక్టర్లు నగర దీపికలు పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయాలు సాధించాలి...

**యాదాద్రి భువనగిరి, మహా:** చిట్యాల ఐలమ్మ 130 వ జయంతి కార్యక్రమం చల్ల గుర్గుల రఘు బాబు ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని అమర వీరుల స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ మాట్లాడుతూ ఆమె చేసిన, త్యాగాలు దొరలపైన పెత్తందారుల పైన భూమి కోసం భుక్తి కోసం పోరాడి దున్నేవాడిదే భూమి అని దొరలపైన పోరాడి తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ ఆశయాలు సాధించాలని మనకందరికీ స్ఫూర్తి అని గుర్తు చేస్తూ చేశారు.

# పీఏసీఎస్ గోదాంల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో PACS ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం నాడు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. 38 లక్షల 56 వేల వ్యయంతో నూతనంగా గోదాములు నిర్మిస్తున్నారు. ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి,PACS చైర్మన్ నర్సింహ్మా రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం

## ప్రతిరోజు కళాశాలకు పంపించే విధంగా కృషి చేయాలి



**ఆమనగల్లు, మహా:** ఇంటర్మీడియట్ విద్యా శాఖ ఆదేశాను సారం అమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాధవరావు ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిదండ్రుల అధ్యాపక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల మార్కుల వివరాలు హాజరు గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. ఇంటర్మీడియట్లో అత్యధిక మార్కులు సాధించడానికి అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు, అధ్యాపకుల సహకారం ఎంతో ముఖ్యమైనదని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా విద్యార్థులను ప్రతిరోజు కళాశాలకు పంపించే విధంగా కృషి చేయాలని తల్లిదండ్రులకుతెలిపారు.కళాశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు, విద్యార్థుల చదువు పట్ల శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలనుఅధ్యాపకులు,విద్యార్థులు,ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, అధ్యాపకులు జైపాల్, పర్వతాలు, నాగమణి, వెంకటయ్య, కృష్ణయ్య, లక్ష్మన్న, రవి, విష్ణు,అలివేలు,చంద్రశేఖర్, లైబ్రేరియన్ చైతన్య,అధ్యాపకేతర సిబ్బంది శేఖర్,విజయ, రాజు, వేణుగోపాల్,సుశీలమ్మ పాల్గొన్నారు

# సర్కిల్ జిహెచ్ఎంసి కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి ఆధ్వర్య లో జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, కార్పొరేట్ తోకల శ్రీనివాసరెడ్డి, డిపిఓ సమక్షంలో మహిళలు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో సర్కిల్ కార్యాలయ సిబ్బంది మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ వారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలి

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండల కేంద్రంలో శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సాయంత్రం పూజా కార్యక్రమాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని,అమ్మ వారి చల్లని చూపు నియోజకవర్గ ప్రజాలందరిపై ఉండాలన్నారు. గ్రామదేవతలను పూజించడం, ఆరాధించడం మన హిందూ సంస్కృత అని అన్నారు.ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు. నేనవాత్ పత్యనాయక్,వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ గౌడ్,యూత్ ప్రెసిడెంట్ వద్దే వెంకటేష్,నాయకులు సైదులు గౌడ్,శ్రీకాంత్ యాదవ్,భాస్కర్ ,మహేష్ నేత,దేవేందర్,ఉత్సవ కమిటీ సభ్యులు మామిడిశెట్టి ప్రవీణ్,శ్రీశైలం(సిరి), బబులు, మహేష్,టిల్లు,తేజ,కృతిక్ తదితరులు పాల్గొన్నారు...

# ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

## జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప



**ఆమనగల్లు, మహా :** జ్ఞాన శక్తి పెంపుకు పుస్తక పఠనం దోహదపడుతుందని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఆమె సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రంగారెడ్డి జిల్లా సీనియర్ న్యాయవాది శశికాంత్ మదుపు సహకారంతో రూ .150 లక్షలతో నూతనంగా ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని శుక్రవారం సాయంత్రం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అందే కార్ యాదిలాల్ తో కలిసి జడ్జి కాటం స్వరూప ప్రారంభించారు. గ్రంథాలయానికి పుస్తకాలు, ఫర్నిచర్ ,కంప్యూటర్, ప్రింటర్,బీరువా సమకూర్చిన శశికాంత్ ను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా జడ్జి కాటం స్వరూప మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులు పుస్తక పఠనం ద్వారా మేధాశక్తిని పెంచుకోవాలని సమాజంలో ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని ఆమె సూచించారు. సమాజంలో యువ న్యాయవాదులు పబ్లిక్ ప్రాసిక్యూటర్, జూనియర్ సివిల్ జడ్జిల వంటి పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి పుస్తక పఠనం ఉపకరిస్తుందన్నారు. చట్టాలు, న్యాయవ్యవస్థపై బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్కు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని శశికాంత్ తెలిపారు. అనంతరం శశికాంతును బారసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ ,న్యాయవాదులు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పిపి కార్తీక్, బారసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు దుడ్డు ఆంజనేయులు, జమీల్ అహ్మద్, రామకృష్ణ ,గణేష్ గౌడ్, పసుపుల మల్లేష్, కొప్పు కృష్ణ, శేఖర్, మధు, శ్రీశైలం, శ్రీనివాస్, అశోక్ తదితరులు ఉన్నారు.

# బలహీన వర్గాల ప్రజల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి, మహా :** ఐలమ్మ పోరాటపటిమను, పట్టుదలను స్ఫూర్తిగా తీసుకొని మనందరం ముందడుగు వేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్య నారాయణ రావు తెలిపారు.శుక్రవారం వీరనారి చాకలి ఐలమ్మ 130 వ జయంతిని పురస్కరించుకొని ఐడిఓసి కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...**

పోరాట ఉద్యమ నాయకురాలు వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళ యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరును పెట్టి సముచితంగా గౌరవించినట్లు తెలిపారు. నాటి రోజుల్లో రజాకారులను, భూ స్వాములను ఎదిరించి పోరాడిన యోధురాలని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల తరపున పోరాడిన వీరనారి ఐలమ్మ రజాకారులు, భూ స్వాములపై చేసిన పోరాటం దేశ చరిత్రలో ఎవరు చేయలేదని కాని నేడు రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. ఆమె ఉద్యమ చరిత్రను కళారూపాల ద్వారా కాలేజీ క్షేత్రంలో మంత్రుల సమక్షంలో నిర్వహించినట్లు తెలిపారు. ఆమె ఆశయాలను ఆచరణలో పెట్టి అమలు చేయాల్సిన బాధ్యతను మనందరం తీసుకోవాలని ఆయన సూచించారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ పోరాటాల ఫలితమే రాష్ట్ర ఏర్పాటుకు కారణమని వివరించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ త్యాగానికి పోరాటానికి స్ఫూర్తి వీరనారి చాకలి ఐలమ్మ నిలిచారని తెలిపారు. చాకలి ఐలమ్మ జన్మదినాన్ని జరుపుకోవడం చాలా గర్వంగా ఉందని ఆమె సింబల్ ఆఫ్ ఉమెన్ ఎంపవర్మెంట్ గా నిలిచారని తెలిపారు. నాటి రోజుల్లో పెత్తందారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేయడం చాలా గొప్ప సంఘటనని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను మన జీవితంలో పాటించాలని వారి త్యాగాలు నేటి తరానికి తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇందిర, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై ఉద్యోగులు

# అవగాహన పెంచుకోవాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**కాటారం, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై పిఓలు, ఏపీవోలు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పిఓలు, ఏపీవోలుకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సర్వం సన్నదంగా స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ చాలా ముఖ్యమైనదని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా న నిర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియ పై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆర్ ఓ, ఏఆర్వోలు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరో విడత రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించడంతో పాటు నిర్వహించిన శిక్షణపై ఎన్నికల సంగం సూచనలు మేరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు ఉంటాయని పోలింగ్ కేంద్రంలో చేయాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణ తదితర అంశాలను మాస్టర్ ట్రైనర్లు సమగ్రంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తారని, ఏదేని సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఆర్ఓ శ్రీనివాస్, సిపిఓ బాబురావు, భూపాలపల్లి ఎంపీడీవో నాగరాజు, ఆర్వోలు, ఏ ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించనప్పటికీ క్షేత్రస్థాయిలో అధికార యంత్రంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం కాటారంలో గ్రామపంచాయతీ,జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల విధులు పై ఉద్యోగుల కు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే నామినేషన్లు ఉపసంహారణ ఓట్ల లెక్కింపులో టేబులు ఏర్పాటు లెక్కించడంపై ఏవిధంగా నిర్వహించాలో శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో బాబు, ఎంపీఓ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

## చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసిన ఎంపీ, మేయర్, ఎమ్మెల్యే, కలెక్టర్, కమిషనర్



**హన్మకొండ మహా;** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా హనుమకొండ న్యూ శాయంపేట జంక్షన్ వద్ద ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, ఇతర అధికారులు, కుల సంఘాల నాయకులు వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మాచిదేవ ట్రస్ట్ భవనంలో వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్, పూలు వేసి నివాళులర్పించారు.

# జిల్లా కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు



**రంగారెడ్డి జిల్లా మహా:** శుక్రవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల ఆవరణలో, జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా, జిఎం ఇండస్ట్రీస్, ఫీషరీస్, మైనార్టీ సంక్షేమ శాఖల వారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మలతో బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించారు. బతుకమ్మ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు స్వయంగా బతుకమ్మలను పేర్చి ఆయా శాఖల నుండి ఉద్యోగుల అందరితో కలిసి తీసుకొచ్చిన బతుకమ్మలతో పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఎ శ్రీలత, జిఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్నిశాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రైతులు నష్టపోకుండా వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతాం

## త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు అండగా నిలుస్తాం: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు మహా:** రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులకు అండగా నిలుస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో మున్సిపల్ అధ్యక్షుడు పత్యనాయక్ అధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు గుర్కా జైపాల్ యాదవ్, మర్రి జనార్దన్ రెడ్డి లు హాజరై మాట్లాడారు.. రైతులు, భూ నిర్వాసితులు చేస్తున్నది న్యాయ పోరాటమని, నిర్వాసితులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని తెలిపారు. కొందరి ప్రయోజనాల కోసం రీజినల్ రింగ్ రోడ్డును వంకలుగా తిప్పారని ధ్వజమెత్తారు. సామాన్య, మధ్య తరగతి రైతులను రోడ్డున పడేస్తూ పారిశ్రామిక వేత్తలు, బడాబాబుల కోసం పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.రైతులు కాంగ్రెస్‌కు ఓట్లు వేసి అధికారంలోకి తెచ్చారని, అయితే అధికారంలోకి వచ్చాక అలైన్‌మెంట్ మార్చి రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానిక కాంగ్రెస్ నేతలు గెలిచిన తర్వాత రైతులను పూర్తిగా మర్చిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం, ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వ్యవసాయ రంగాన్ని సుభిక్షం చేశామన్నారు. రైతులు నష్టపోకుండా వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని భరోసా ఇచ్చారు.సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, యూత్ వింగ్ అధ్యక్షులు వద్దే వెంకటేష్, సైదులు గౌడ్, గండికోట శంకర్, పూసల భాస్కర్, మహేష్‌నేత, నిరంజన్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఐలమ్మ ధైర్యసాహసాలు ప్రజాస్వామిక

# పోరాటాలకు స్ఫూర్తి

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి తెలంగాణ మహిళా చైతన్యానికి ప్రతీక అని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా, మంచాల మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆమె తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మాజీ సర్పంచ్ చీమల జంగయ్య, అనంగల్ల యాదయ్య, మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మారగోని మాసయ్య గౌడ్, మార సురేష్, అంతటి రాజు గౌడ్, చెరుకు నర్సింహా, అశ్వల బాలరాజు, శ్రీనివాస్ నాయక్, పాండాల శ్రీనివాస్, మొగిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు



# 856 కిలోల గంజాయి దగ్ధం

**హన్మకొండ మహా;** హైదరాబాద్‌లోని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 18 కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న సుమారు 3కోట్ల 63 లక్షల రూపాయల విలువ గల 726 కిలోల గంజాయిని హనుమకొండ జిల్లా, అమ్మ వారిపేట లోని కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్ వద్ద (ఇన్సినరేషన్ పద్ధతి) ద్వారా దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఛైర్మన్ శ్రీ అంకిత్ కుమార్ సంక్వార్, ఐపీఎస్, డీసీపీ ఈస్ట్ జోన్, శ్రీ ఎన్.రవి, అదనపు డీసీపీ (అడ్మిన్), శ్రీ పి.డేవిడ్ రాజు, ఏసీపీ సీసీఆర్బీ, వరంగల్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్తి విక్రయాలకు పంట నమోదు తప్పనిసరి

## మండల వ్యవసాయ అధికారి విద్యాదారి

**రంగారెడ్డి జిల్లా మహా:** వానాకాలం 2025 లో ప్రత్తి సాగు చేసిన రైతులు, సీసీఐ ద్వారా ప్రత్తి కొనుగోలు కేంద్రంలో, పంట అమ్మదలచిన రైతులు, పంట నమోదు తప్పనిసరి చేసుకోవాలని, మండల వ్యవసాయ అధికారి విద్యాదారి, రైతులకు సూచించారు. ఆమె మాట్లాడుతూ... రైతులు పండించిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తెచ్చే ముందు పత్తిలో ఎండుటాకులు, చెత్త, గడ్డి లేకుండా చూసుకోవాలని, నిర్ణీత తేమ శాతం కలిగిన, నాణ్యత ప్రమాణాలు కలిగిన ప్రత్తి మాత్రమే కొనుగోలు చేయబడుతుందని ఆమె రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తి పంట వేసిన రైతులు ఈనెల 30వ తారీకు లోపు తమ పంటను, మీ పరిసర వ్యవసాయ కేంద్రాలలో పంట నమోదు చేసుకోవాలని అన్నారు. పంట నమోదు చేసుకొని రైతుల వద్ద నుండి, సిసిఐ కేంద్రాల వద్ద, పత్తి సేకరణ జరపలేమని తెలియజేశారు.

# కడ్తాల్లో వివాహిత ఆత్మహత్య

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండలం సాలార్పూర్ గ్రామానికి చెందిన శిరీష ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ గంగాధర్ శుక్రవారం చెప్పారు. మృతురాలికి ఐదు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన రాకేశ్తో వివాహమైందని, భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండే వారని తెలిపారు.ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఆయన వివరించారు.మృతురాలు తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# వీరనారీ చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరించిన భువనగిరి ఎమ్మెల్యే

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ డల కేంద్రంలో శుక్రవారం నాడు తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా అమె విగ్రహం ఆవిష్కరణ చేసి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి... ఈ సందర్భంగా రజాకర్లకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ వీరోచిత పోరాటం చేసిందని ఆమె ధైర్యసాహసాలు మహా గొప్పవని అన్నారు నేటి మహిళలు ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు

# జిల్లాలో ప్రథమ స్థానం పీఏసీఎస్ ఉప్పరగూడ

## పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి




**రంగారెడ్డి జిల్లా మహా:** ఉప్పరగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో, బ్యాంక్ చైర్మన్ పాండురంగ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో వాడి వేడిగా చర్చలు జరిగాయి. చైర్మన్ పాండురంగారెడ్డి, రైతులను సమన్వయం చేసుకుంటూ సమావేశం కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ... సొసైటీ ద్వారా ఈ వానకాలం వంటలకు కావాల్సిన యూరియాను, రైతులకు సకాలంలో అందించడం జరిగిందని, ఇక ముందు కూడా రైతులకు కావాల్సిన ఎరువులు ఇతరత్రా సహకారాలు అందించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో మన బ్యాంక్, రైతుల సహకారంతో మొదటి స్థానంలో ఉందని, దీనికి మీరందరు సహకారం అందించడం సంతోషంగా ఉందని చైర్మన్ కొనియాడారు. ఈ సందర్భంగా హాజరైన సహకార సంఘం జిల్లా అధికారి సరస్వతి మాట్లాడుతూ ఉప్పర్ కూడా సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బ్యాంకు యొక్క పనితీరు బాగుందని ఆమె అభినందించారు. జిల్లా నుంచి రైతులకు కావాల్సిన సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు, సీఈఓ గణేష్, ఇతర ఉద్యోగులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ధనలక్ష్మీ దేవి అలంకరణలో వాసవీ మాత

## భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకమర్చనలు, యజ్ఞ హోమాలు



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయ అధ్యక్షుడు వీరబోమ్మ రామ్మోహన్ ఆధ్వర్యంలో వాసవీ మాత ధనలక్ష్మీ దేవి అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. నగదుతో అమ్మవారిని ఎంతో దేదీప్యమానంగా అలంకరణ చేశారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలై కండె చంద్రిక సుమన్, సామల ఊర్మిళ నర్సింహా దంపతుల చేత సామూహిక కుంకమర్చనలు, యజ్ఞ హోమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. అమ్మవారికి తిలక ధారణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. దేవతలందరికీ నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి తదుపరి తీర్థ ప్రసాద వితరణ మరియు భక్తులకు భోజన ప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి బిక్కుమండ్ల నర్సింహా, డాక్టర్ శ్రీనివాస్, మంచుకొండ విష్ణువర్ధన్, అర్థం లక్ష్మయ్య, కండె లింగయ్య, అశోక్, విడియాల ఆనంద్, ఉప్పల శ్యామ్, రమేష్, జూలూరి నర్సింహా, బిక్కుమండ్ల యాదయ్య, మేడిశెట్టి శ్రీధర్, బిక్కుమండ్ల కృష్ణయ్య, బిల్లకంటి కిషోర్ మరియు ఆర్యవైశ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులకు అండగా ఉంటా-కంది శ్రీనివాస రెడ్డి




**ఆదిలాబాద్ మహా :** వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా శాయ శక్తులా కృషి చేస్తానని వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలంగాణ వయోవృద్ధుల సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. కంది శ్రీనివాస రెడ్డి కి సీనియర్ సిటిజెన్స్ ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.వివిధ విభాగాలలో పని చేసి రిటైర్మెంట్ తీసకున్న సీనియర్ సిటిజెన్స్ ప్రశాంతంగా తమ రిటైర్మెంట్ జీవితాన్ని గడపాలని కంది శ్రీనివాస రెడ్డి ఆకాంక్షించారు. తమకున్న అపార అనుభవంతో శేష జీవితాన్ని సమాజ చైతన్యం కోసం , సామాజిక కార్యక్రమాల కోసం వినియోగించాలని అభిలషించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో గిమ్మ సంతోష్ , లోక ప్రవీణ్ రెడ్డి ,అల్చెట్టి నాగన్న, వయోవృద్ధుల సమాఖ్య నాయకులు దేవిదాస్ దేశ్ పాండె,రామ్ కులకర్ణి, సత్యనారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణులతో కంది శ్రీనివాస రెడ్డి

# జూమ్ మీటింగ్



**ఆదిలాబాద్ మహా :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఓట్ చోర్ గద్దీ చోడ్ ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్న ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాలతో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంచార్జి కంది శ్రీనవాస రెడ్డి నేతృత్వంలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుండి నియోజక వర్గంలోని పార్టీ నాయకులు కార్యకర్తలతో ఇదే అంశంపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఓట్ల చోరీ కేవలం బీహార్ లో మాత్రమే కాకుండా ఉత్తర ప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో కూడా జరిగిందని పార్లమెంట్ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్న మాటలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి బీజేపీ విధానాలను ఎండగట్టాలని కంది శ్రీనివాస రెడ్డి శ్రేణులకు సూచించారు. తమకు అనుకూలంగా లేని ఓట్లను తొలగించి బీజేపీ గద్దెనెక్కాలని ఈ కుట్రకు పాల్పడిందన్న విషయాన్ని ప్రచారంచేయాలన్నారు. నియోజక వర్గంలో ప్రస్తుత నూతన ఓటర్ లిస్ట్ లో ఏవైనా దొంగ ఓట్లు నమోదైతే పార్టీ పెద్దల దృష్టికి తీసుకురావాలని రానున్న స్థానిక ఎన్నికలలో అనుసరించాల్సిన విధివధానాలపై శ్రేణులకు దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి ,డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,తాజా మాజీ కౌన్సిలర్స్ బండారి సతీష్, జాఫర్ అహ్మద్, దర్శనాల లక్ష్మణ్, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, అల్చెట్టి నాగన్న,బూర్ల శంకరయ్య,ఓరగంటి అఖిల్ ,అశోక్,డేరా కృష్ణ రెడ్డి,ఎం.ఏ కయ్యుమ్, చంద్రశావ్ పటేల్ ,ఎల్మ రామ్ రెడ్డి, తమ్మల చందు,రఫీక్, రాజా రెడ్డి,నాగన్న నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కంది శ్రీనివాస రెడ్డి

# పరామర్శ

**ఆదిలాబాద్ మహా :** బాధలో దుఖంలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెబుతూ అండగా నిలబడతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి.అనారోగ్యంతో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి పరామర్శించి నేనున్నానంటూ కొండంత భరోసా కల్పిస్తారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారి గూడ లో నివాసముంటున్న జమియత్ ఉల్మా జిల్లా అధ్యక్షులు హాఫీజ్ అబూబకర్ హామెద్ నివాసాన్ని సందర్శించారు. కంటి ఆపరేషన్ చేయించుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను కలిసి పరామర్శించారు.

# దుర్గామాతకు లక్ష తులసి దళాలతో ప్రత్యేక పూజలు

**పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని దంపతులు, మేయర్**



**హన్మకొండ మహా;** హనుమకొండ వేయి స్తంభాల దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరిన దుర్గామాతకు శుక్రవారం రోజున అత్యంత వైభవంగా లక్ష తులసి దళాలతో ప్రత్యేక అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ విశేష పూజలో ఎమ్మెల్యే నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి ,నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. వేయి స్తంభాల గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గమాతకు అత్యంత భక్తి శ్రద్ధలతో లక్ష తులసి దళాలను సమర్పించి అర్చన చేశారు. అంతకుముందు, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు వరంగల్ భద్రకాళి ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాల తో పాటు శేష వస్త్రాన్ని అందజేశారు.

# మెడికల్ ఏజెన్సీకి రూ.25 వేల జరిమాన

**వరంగల్ మహా;** కాలం చెల్లిన మందుల (మెడిసిన్స్) ను దహనం చేస్తున్న మెడికల్ ఏజెన్సీ కి రూ.25 వేలు పెనాల్టీ విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం బల్దియా పరిధి 28వ డివిజన్ సంతోషి మాత కాలనీ ప్రాంతం లో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆకస్మిక పర్యటన చేస్తున్న తరుణంలో కాలం చెల్లిన (గడువు తీరిన మెడిసిన్స్) ను హిందుస్థాన్ ఏజెన్సీ కి చెందిన సిబ్బంది దహనం చేయడం గమనించిన కమిషనర్ వారిని విచారించగా గడువు తీరిన మెడిసిన్స్ ను దహనం చేస్తున్నట్లు సదరు యాజమాన్యం తెలిపారు. ఈ క్రమం లో సదరు మెడికల్ ఏజెన్సీ కి జరిమాన విధించాలని కమిషనర్ ఆదేశించగా ప్రజల ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా రూ.25 వేలు జరిమానా విధించడం జరిగిందని, నగరం లోని మెడికల్ ఏజెన్సీ లు మెడికల్ షాపు నిర్వాహకులు గడువు తీరిన మెడిసిన్స్ తమ వద్ద నిల్వ ఉంటే సదరు కంపెనీకి తిరిగి పంపించాలని, వాటిని కాల్చడం వల్ల పర్యావరణానికి విఘాతం కలగడం తో పాటు వాటి నుండి వచ్చే కాలుష్య కారకాలు మనుషుల ఆరోగ్యం పై పెను ప్రభావాన్ని చూపుతాయని కావున మెడికల్ ఏజెన్సీ దారులు బల్దియా కు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులను కోరారు.

## డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో ముగ్గురికి జైలు

**వరంగల్ మహా ;** వరంగల్ నగరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 11 మంది వ్యక్తులను శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. వారిలో ముగ్గురికి జైలు శిక్ష, మిగతా వారికి జరిమాన విధిస్తూ గౌరవ మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం తీర్పు ఇచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, అడిషనల్స్ డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. జైలు శిక్ష పడిన ఈ ముగ్గురిని హుజూరాబాద్ సబ్ జైలుకు తరలించడం జరిగింది. మిగతా 8 మంది వ్యక్తులకు కోర్టు రూ.10,700 జరిమానా విధించింది.

# చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తి

**ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు**

**హన్మకొండ మహా;** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పరిపాలన విభాగం భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పరిపాలన అదనపు డీసీపీ రవి ముఖ్య అతిధి హాజరై చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చాకలి ఐలమ్మ కు నివాళులు అర్పించిన వారిలో అదనపు డీసీపీ సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏ. ఓ సంపత్, ఏసీపీ లు అంతయ్య, జాన్ నర్సింహులతో పాటు ఆర్ ఐలు, ఇన్స్ స్పెక్టర్లు, ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టాన్ని తరచుగా పర్యవేక్షించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టాన్ని తరచుగా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద నీటిమట్టం స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున ఏర్పడే వరద పరిస్థితులను సమీక్షించాలని తెలిపారు. ప్రాజెక్టులోకి చేరుతున్న వరద నీటిమట్టంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజారక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలే కాకుండా మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలు కారణంగా వరద నీరు ఉధృతి పెరిగే అవకాశం ఉందని చెప్పారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

**వరంగల్ మహా;** తెలంగాణ సాయుధ పోరాటంలో వీర నారి మణిగా నిలిచిన ధైర్యవంతురాలు చాకలి ఐలమ్మ అని నర్సంపేట నియోజకవర్గ శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని నెక్కొండ మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ గారి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ చాకలి ఐలమ్మగారి పోరాటం నేటి యువతకు ఒక గొప్ప స్ఫూర్తిదాయకమని, ఆమె సామాన్య వర్గానికి చెందినప్పటికీ సామాజిక అసమానతలకు, భూ దోపిడీకి, జమీందారీ శాసనానికి వ్యతిరేకంగా పోరాడారని, ఆమె ధైర్యం పట్టుదల మనందరికీ ఆదర్శం కావాలని తెలిపారు.

# వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టండి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**వరంగల్, హన్మకొండ మహా;** వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా పరిధి లోని హన్మకొండ బాలసముద్రం ప్రాంతం లోని ఫ్రీడం పార్క్ సమీపం లో పలు ప్రాంతాల తో పాటు వరంగల్ పరిధి రామన్న పేట ప్రాంతం లో శానిటేషన్, ఇంజనీరింగ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరం లోని పలు ప్రాంతాలలో వరద నీరు నిలిచే అవకాశం ఉంటుందని అట్టి ప్రాంతాల్లో ఎప్పటికపుడు నీటిని తొలగించాలని అన్నారు. ఇదే ప్రాంతంలో జే సి బి నుండి టిప్పర్ లోకి తరలిస్తున్న చెత్త తరలింపు విధానాన్ని మేయర్ పరిశీలించారు. అదేవిధంగా వరంగల్ పరిధి రామన్న పేట ప్రాంతం లో వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక వైపు ప్రాంతం లో వరద నీరు నిలిచిన నేపథ్యం లో ఆ ప్రాంతం లో పర్యటించి నీటిని తొలగించేలా అధికారులను ఆదేశించారు.పై నుండి వచ్చే వరద నీరు తో పాటు చెత్త చెదారం డ్రైన్ లలో పేరుకుపోవడం వల్ల నీరు నిలుస్తుందని వర్షాకాలం ముగిసే వరకు ఈ ప్రాంతం పై ప్రత్యేక దృష్టి సారించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని నీరు సాఫీగా వెళ్ళిపోవడానికి వీలుగా అవసరం మేరకు డ్రైన్ పై కప్పు తొలగించి చెత్తను తొలగించాలని ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండడానికి మురికి కాలువలు ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

# మహిళా చైతన్య స్ఫూర్తి చాకలి ఐలమ్మ కంది శ్రీనివాస రెడ్డి



- ప్రజాసేవాభవన్ లో ఐలమ్మ జయంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు

**ఆదిలాబాద్ మహా:** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలని , మహిళా చైతన్య స్ఫూర్తి అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణం లోని తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ భవన్ లో ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. అణగారిన అట్టడుగు వర్గాల కోసం పేద బడుగు బలహీనుల కోసం గళమెత్తడమే కాకుండా వారికోసం పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె ఆకాంక్షలకనుగుణంగా ఆమె ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,తాజా మాజీ కౌన్సిలర్ బండారి సతీష్, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, అల్చెట్టి నాగన్న,బూర్ల శంకరయ్య,ఓరగంటి అఖిల్ ,అశోక్,డేరా కృష్ణ రెడ్డి ,ఎం.ఏ కయ్యుమ్, చంద్రశావ్ పటేల్ ,ఎల్మ రామ్ రెడ్డి, తమ్మల చందు,రఫీక్, రాజా రెడ్డి,నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

**750 గ్రాముల గంజాయి, వెయ్యి నగదు, ఆటో స్వాధీనం.. మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి**



**మందమర్రి, మహా :** ప్రభుత్వ నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్టు చేసినట్లు మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు, రామగుండం టాస్క్ ఫోర్స్ టీం , మందమర్రి పోలీసులు శుక్రవారం మందమర్రి టోల్ ప్లాజా వద్ద గల రెస్ట్ ఏరియాలో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆసిఫాబాద్ జిల్లా, ఈజ్‌గావ్ గ్రామానికి చెందిన గంజాయి విక్రయదారుడు తరుణ్ సర్కార్ నుండి మంచిర్యాల పట్టణం, తిలక్ నగర్‌కు చెందిన షేక్ అజీజ్, వనం సాయి కృష్ణ అనే ఇద్దరు వ్యక్తులకు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు స్పష్టం చేశారు. తమ విచారణలో సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో తరుణ్ సర్కార్ ఒడిశా నుండి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, మంచిర్యాల ప్రాంతంలోని యువకులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారని ఆయన వెల్లడించారు. గంజాయికి బానిసలైన షేక్ అజీజ్, వనం సాయి కృష్ణ ఇద్దరు తక్కువ ధరకు విక్రయించి ఎక్కువ ధరకు అమ్మాలని పథకం వేసుకొని ఈ వ్యవహారానికి పూనుకున్నట్లు వెల్లడించారు. నిందితుల నుండి 750 గ్రాముల గంజాయి విలువ సుమారు 15 రూపాయలు, వెయ్యి రూపాయల నగదు, ఒక ఆటో, మూడు స్మార్ట్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో తరుణ్ సర్కార్, షేక్ అజీజ్ లా ఇద్దరిపై ఇదివరకు గంజాయి క్రయవిక్రయాల కేసులు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, గంజాయి ఇతర మత్తుపదార్థాలపై గట్టినిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయి అమ్మినా, రవాణా చేసినా, వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.యువత ఇలాంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులై తమ విలువైన జీవితాన్ని, కుటుంబాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి వంటి ప్రమాదకర వ్యసనాలు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా మనిషిని మనిషి శరీర భాగాలను చిత్తు చేస్తాయని వెల్లడించారు. ముఖ్యంగా యువకుల తల్లిదండ్రులు నిత్యం తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సూచించారు. మీ చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో గంజాయి అమ్మకం, వినియోగానికి సంబంధించిన సమాచారం మీకు తెలిస్తే, దయచేసి వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని అన్నారు. పట్టుబడిన ముగ్గురు నిందితులపై ఎన్.డి.పి.ఎస్. చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్సై రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

# మంచిర్యాల జిల్లా కలెక్టర్ ను సన్మానించిన అధికారులు

**మంచిర్యాల, మహా :** జల్ సంజయ్ జన్ భగీదారి అవార్డుకు మంచిర్యాల జిల్లా ఎంపిక కావడంలో విశేష కృషి చేసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా పూర్తిచేసిన 84 వేల 549 పనులను కేంద్ర బృందం తనిఖీ చేసింది. జిల్లాలో భూగర్భ జలాల అభివృద్ధికై కృషి చేసినందుకుగాను మంచిర్యాల జిల్లాను అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి అవార్డు మంచిర్యాల జిల్లాకు రావడానికి కృషి చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పి. ఎం. కె. ఎస్. పై. సిబ్బంది పాత్ర చాలా ఉందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఎ.పి.ఓ.లు, ఈ.సి.లు, టి.ఎ.లు, సి.ఓ.లు, ఎఫ్.ఎ.లు పాల్గొన్నారు.

# పనుల్లో నాణ్యత ఉంటేనే బిల్లుల చెల్లింపు

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**



**వరంగల్ మహా;** జరిగిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు జరుగుతుందని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం గ్రేటర్ నగర పరిధిలోని పలు ప్రాంతాలలో అభివృద్ధి పనులు పూర్తయిన నేపథ్యంలో వాటికి బిల్లుల చెల్లింపుల కోసం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భం గా కమిషనర్ గ్రేటర్ వరంగల్ పరిధిలోని 24 వ డివిజన్ లో, వార్త ఆఫీస్ వద్ద, 25వ డి మార్ట్ ప్రాంతాల్లో, 28వ డివిజన్ సంతోషిమాత గుడి వద్ద, 34వ ,35వ డివిజన్ శివనగర్, 36 డివిజన్ చింతల్ తదితర ప్రాంతాల్లో పర్యటించి డ్రైన్ లు, రోడ్ల నిర్మితమైన పనుల ప్రమాణాలను ఎంబిబుక్ ల ప్రామాణికం గా కొలతలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ సంతోష్ బాబు, ఏఈ హాబీబుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



# కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా..

**కంది శ్రీనివాస రెడ్డి**

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌజింగ్ బోర్డ్ కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. కాలనీలోని అభయ్ మండల్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. మండపం లోని అమ్మవారికి ఆయన పూజలు చేసారు. కమిటీ సభ్యులు పలు సమస్యలను కంది శ్రీనివాస రెడ్డి దృష్టికి తేగా అధికారులు, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ , కాలనీ కమిటీ సభ్యులు శ్రవణ్ నాయక్, పడాల రవీందర్, రాములు,ప్రకాష్ , ఠాకూర్, స్వామి, విఠల్ , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.









# కార్లకు దసరా కళ..

అటు జీఎస్టీ రేట్ల తగ్గింపు, ఇటు దసరా నవరాత్రులు ఆటో మొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియాకి బాగా కలిసొచ్చాయి. నవరాత్రులు ప్రారంభమైనప్పటి నుంచి గురువారం సాయంత్రం 6 గంటల వరకు కంపెనీ 75,000 పైచిలుకు వాహనాలను విక్రయించింది. చిన్న కార్లలో కొన్ని వేరియంట్ల డెలివరీ కోసం నిరీక్షించే పరిస్థితి కూడా నెలకొందని సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. ప్రస్తుతం రోజుకు 80,000 పైచిలుకు ఎంక్వైరీలు వస్తున్నాయని, ఇది సాధారణంగా వచ్చే 40,000-45,000 ఎంక్వైరీలకు రెట్టింపని వివరించారు. రోజుకు సుమారు 18,000 బుకింగ్స్ నమోదవుతున్నాయన్నారు. 'నవరాత్రులు ప్రారంభమయ్యాక గురువారం సాయంత్రం 6 గం.ల సమయానికి 75,000 వాహన విక్రయాలు నమోదయ్యాయి. రోజు ముగిసే సరికి ఇది 80,000 యూనిట్లకు పెరుగుతుందని భావిస్తున్నాం' అని పార్థో బెనర్జీ తెలిపారు. పండుగ సీజన్‌లో చిన్న కార్లపై గణనీయంగా ఆసక్తి నెలకొందని ఆయన చెప్పారు. ఎంట్రీ లెవెల్ కార్ల సెగ్మెంట్‌లో దేశవ్యాప్తంగా బుకింగ్స్ 50 శాతం పెరిగాయని పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు కోసం కొనుగోలుదారులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారని, అప్‌గ్రేడ్ కావడానికి ఇదే సరైన సమయమని బెనర్జీ వివరించారు.




# ఏఐ సొల్యూషన్స్, సర్వీసులపై లెనొవొ దృష్టి



**హైదరాబాద్, బిజినెస్:** స్మార్ట్ ఏఐ (కృత్రిమ మేధ) ప్రయోజనాలను అందరికీ మరింతగా అందుబాటులోకి తేవాలని టెక్ దిగ్గజం లెనొవొ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా కేవలం పీసీలు మొబైల్స్‌లాంటి ఉత్పత్తులే కాకుండా ఏఐ ఆధారిత మౌలిక సర్వీసులు, సొల్యూషన్స్‌ను విస్తృతంగా అందిస్తున్నట్లు లెనొవొ ఇండియా ఎండీ అమిత్ లూథ్రా, ఈడీ రోహిత్ వెల్లడించారు. ఇతర ఆసియా పసిఫిక్ దేశాల్లోని సంస్థలు బ్యాక్-ఆఫీస్ అవసరాల కోసమే ఏఐని ఉపయోగిస్తుండగా, దేశీయంగా సేల్స్, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్లు గణనీయంగా కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నాయని చెప్పారు. భారత్‌లో ఇప్పటికే 53 శాతం సంస్థలు ఏఐ ఆధారిత పీసీలను వినియోగిస్తున్నట్లు చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్స్‌పై (సీఐవో) నిర్వహించిన తమ అధ్యయనంలో వెల్లడైందని హైదరాబాద్‌లో తమ ఏఐ పోర్ట్‌ఫోలియోను డిస్‌ప్లే చేసిన సందర్భంగా వివరించారు. ప్రస్తుతం దేశీయంగా పర్సనల్ కంప్యూటింగ్ ఉత్పత్తుల విభాగంలో రెండో స్థానంలో, ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ విభాగంలో మూడో స్థానంలో ఉన్నట్లు రోహిత్ చెప్పారు. భారత్‌లో 5 తయారీ ప్లాంట్లు, సుమారు 1,700 మంది సిబ్బంది ఉండగా, గత ఆర్థిక సంవత్సరం 3.4 బిలియన్ డాలర్ల ఆదాయం నమోదైందని ఆయన వివరించారు.

# ధోని ఇన్వెస్ట్ చేసిన కంపెనీకి ఎన్ఎస్ఈ ఓకే

## ఫినాన్స్ బుద్ధ లిస్టింగ్‌కు లైన్ క్లియర్



సుప్రసిద్ధ క్రికెటర్ ఎంఎస్ ధోని, ఇన్వెస్టర్ ఆశిష్ కచోలియా, క్యామ్స్ వ్యవస్థాపకుడు వి.శంకర్‌కు పెట్టుబడులున్న ఫిన్‌బడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా సూత్రప్రాయ అంగీకారాన్ని తెలియజేసింది. ఫైనాన్స్ బుద్ధ బ్రాండుతో రుణ సౌకర్యాలకు దారిచూపే కంపెనీ.. ఎస్ఎంఈ విభాగంలో నిధుల సమీకరణ చేపట్టనుంది. దీని ద్వారా ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ ఫిజిటల్ రుణాల సంస్థ లిస్ట్‌కానుంది. ఐపీవోలో భాగంగా రూ.10 ముఖ విలువగల 50.48 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఇష్యూ నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, అనుబంధ సంస్థ ఎల్‌టీసీవీ క్రెడిట్‌లో పెట్టుబడులు, బిజినెస్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ కార్యకలాపాలతోపాటు.. రుణ చెల్లింపులకు వినియోగించనుంది. ఫిన్‌బడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను 2012లో వివేక్ భాటియా, పార్థ్ పాండే, పరాగ్ అగర్వాల్ ఏర్పాటు చేశారు.




# వెండి.. మరో రికార్డ్

## రూ.1,000 పెరిగి రూ.1.40 లక్షలకు చేరిన ధర

## రూ.600 తగ్గిన బంగారం

**న్యూఢిల్లీ:** వెండి ధర గురువారం దేశీయంగా సరికొత్త జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది. కిలోకి రూ.1,000 పెరిగి రూ.1,40 లక్షలకు చేరింది. మరోవైపు కొన్ని రోజులుగా రికార్డుల బాటలో నడిచిన పసిడి (99.9 శాతం స్వచ్ఛత) 10 గ్రాములకు రూ.630 నష్టపోయింది. రూ.1,17,370 స్థాయి వద్ద ఉంది. అంతర్జాతీయ మార్కెట్లోనూ స్పాట్ మార్కెట్లో వెండి ధర ఔన్స్‌కు 2 శాతానికి పైనే పెరిగి 45 డాలర్లకు చేరుకుంది. దేశీయంగా ఎంసీఎక్స్ (ఫ్యూచర్స్) మార్కెట్లో డిసెంబర్ కాంట్రాక్టు వెండి ధర రూ.3,528 పెరిగి రూ.1,37,530 వద్ద కొత్త గరిష్టాన్ని నమోదు చేసింది. 10 గ్రా. బంగారం కాంట్రాక్టు ధర రూ.223 పెరిగి రూ.1,12,778కు చేరింది. రేట్ల తగ్గింపుపై ఫెడ్ సానుకూల వైఖరి, 2025లోనూ రేట్ల కోత ఉంటుందన్న అంచనాలు ధరల పెరగుదలకు కారణమైనట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చితులకుతోడు డాలర్‌పై ఆధారపడడం తగ్గించుకోవడం అన్నవి బంగారం, వెండిలో కొనుగోళ్లకు మద్దతునిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయంగా పసిడి ధర ఔన్స్‌కు 8 డాలర్ల నష్టంతో 3,760 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL



# విదేశీ గడ్డపై అడ్డంకులు

## వలస విధానాలు కఠినతరం చేస్తున్న అనేక దేశాలు

## భారతీయుల విదేశీ ఉద్యోగావకాశాలపై ప్రభావం

## మనవాళ్ల ఆదాయం ఎక్కువ ఉండటమూ కారణమే

## స్థానికుల్లో అసంతృప్తి చల్లబరిచేందుకు ప్రయత్నాలు

హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచుతూ అమెరికా తీసుకున్న నిర్ణయం ముఖ్యంగా భారతీయులను షాక్‌కు గురి చేసింది. ఒక్క యూఎస్ మాత్రమే కాదు.. భారతీయులు సంప్రదాయకంగా ఉద్యోగాల కోసం తరలివెళ్లే అనేక పాశ్చాత్య దేశాల్లో ఇలాంటి అవరోధాలు ఉన్నాయి. ఈ దేశాలు చరిత్రాత్మకంగా నిపుణుల కొరతను పూడ్చుకోవడానికి, ఆర్థిక వృద్ధిని నడిపించడానికి భారత్, చైనా వంటి దేశాలపై ఆధారపడి ఉన్నాయి. అయితే ఇటీవలి కాలంలో ఆయా పాశ్చాత్య దేశాల్లోని ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చింది. విదేశీ కార్మికుల కంటే సొంత పౌరులకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నైపుణ్యం కల విదేశీ కార్మికులను ప్రోత్సహించకుండా ఉండటానికి తమ వలస విధానాలకు అనుగుణంగా ఆయా దేశాలు మార్పులు చేసుకుంటున్నాయి. అదే సమయంలో అక్రమ, తక్కువ నైపుణ్యమున్న కార్మికులను నిలువరిస్తున్నాయి.

**మనవాళ్ల ఆదాయం ఎక్కువ**

కొన్ని ప్రధాన దేశాల్లో నివసిస్తున్న భారతీయుల ఆదాయం స్థానికుల ఆదాయం కంటే అధికంగా ఉంటోంది. తమ దేశంలో ఉంటూ తమ కంటే ఎక్కువ ఆర్జించడం ఆయా దేశాల స్థానికులకు, ముఖ్యంగా యువతకు మింగుడు పడడం లేదన్నది నిపుణుల మాట. యూఎస్ సిటిజన్స్ తో పోలిస్తే.. అక్కడ ఉంటున్న భారతీయుల ఆదాయం రెండింతలకుపైగా ఉంది. ఆస్ట్రేలియా, జర్మనీల విషయంలో ఇది సుమారు 50 శాతం ఎక్కువ. భారతీయుల వల్ల తమ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయనే కోపం ఒకవైపు.. తమకంటే ఎక్కువ సంపాదిస్తున్నారన్న అసూయ మరోవైపు.. వెరసి ఆస్ట్రేలియా, యూకే వంటి అనేక దేశాల్లో స్థానిక యువత అక్కడున్న భారతీయులపై దాడులు చేస్తున్నారు. 'గో బ్యాక్ టు ఇండియా' అంటూ బహిరంగంగానే మనవాళ్లను



హెచ్చరిస్తున్న సంఘటనలు సైతం పెరుగుతూనే ఉన్నాయి.

**వలసలు తగ్గించాలని..**

గడిచిన రెండు సంవత్సరాలలో వలసలను తగ్గించేందుకు పాశ్చాత్య దేశాలు అనేక నిర్ణయాలు తీసుకున్నాయి.

యూఎస్: కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తుకు 1,00,000 డాలర్ల వన్-టైమ్ ఫీజు అమలులోకి తెచ్చింది.

యూకే: వర్క్ పర్మిట్ కోసం కనీస వేతన పరిమితిని 38,700 పౌండ్స్ నుంచి 2025 జూలైలో 41,700 పౌండ్స్‌కు పెంచింది.

స్వీడన్: వర్క్ పర్మిట్ కోసం కనీస జీతం పరిమితి 2023 అక్టోబర్ నుంచి రెండింతలకుపైగా అధికమై 29,680 క్రోనర్లకు (ఆ దేశ కరెన్సీ. ఒక క్రోనా సుమారు రూ.9.37) చేరింది.

కెనడా: 2025లో విద్యార్థులు, కార్మికుల దరఖాస్తుల అనుమతిని 10-16% తగ్గించాలన్నది ప్రణాళిక.

ఆస్ట్రేలియా: 2025 నాటికి నికర వలసలను సగానికి తగ్గించే ప్రయత్నంలో భాగంగా 2023-24లో విద్యార్థి వీసాల జారీని 34% తగ్గించారు.

# లద్దాఖ్ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అరెస్ట్



**ఢిల్లీ:** కేంద్ర పాలిత ప్రాంతం (యూటీ) లద్దాఖ్‌లో హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఉద్యమకారుడు, పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్)ను పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు రోజుల క్రితం లద్దాఖ్‌లో జరిగిన అల్లర్లకు కారణం వాంగ్‌చుక్‌గా కారణంగా భావిస్తూ పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. హింసను రెచ్చగొట్టినట్టు వాంగ్‌చుక్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో వాంగ్‌చుక్ ఎన్‌జీవో లైసెన్స్‌ను సైతం కేంద్రం రద్దు చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ.. ఆయన స్థాపించినస్వచ్ఛంద సంస్థకు విదేశీ నిధులు స్వీకరించే హక్కును కూడా రద్దు చేసింది. అరెస్టుకు ముందు వాంగ్‌చుక్ వ్యాఖ్యానిస్తూ.. ఈ ఉద్యమం కోసం అరెస్టయితే సంతోషంగా స్వీకరిస్తానన్నారు. లద్దాఖ్ రాష్ట్ర హక్కుల కోసం ప్రజలు చేపట్టిన నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడంతో ప్రభుత్వం కర్ఫ్యూ విధించించిన సంగతి తెలిసిందే. దీంతో వాంగ్‌చుక్.. తాను చేపట్టిన రెండు వారాల దీక్షను కూడా ఆయన ముగించిన సంగతి తెలిసిందే. లద్దాఖ్‌కు తక్షణమే రాష్ట్ర హోదా కల్పించాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చి రాజ్యాంగపరమైన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ రాజధాని లేహ్‌లో జనం బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా హింస ప్రజ్వరిల్లింది. ఆందోళనకారులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బీజేపీ కార్యాలయానికి నిప్పుపెట్టారు. సీఆర్‌పీఎఫ్ వ్యాన్ సహా పలు వాహనాలను దహనం చేశారు. వీధుల్లో విధ్వంసం సృష్టించారు. ఇళ్లు, దుకాణాలపై దాడులకు దిగారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీలకు పనిచెప్పారు. ఈ ఘటనలో నలుగురు మరణించారు. 70 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో పదుల సంఖ్యలో పోలీసులు సైతం ఉన్నారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వం లద్దాఖ్‌లో కర్ఫ్యూ విధించింది. ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడొద్దని ఆదేశించింది. నిరసన ప్రదర్శనలు, ర్యాలీలకు అనుమతి లేదని, జనం ఇళ్ల నుంచి బయటకు రావొద్దని స్పష్టంచేసింది. పోలీసుల కాల్పుల్లో నలుగురు మరణించినట్లు ఆందోళనకారులు ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే వారు కాల్పులు జరిపినట్లు మండిపడ్డారు.



# అల్విదా.. ఓ అద్భుతమా!

**ఢిల్లీ:** భారత వాయు సేనలో 62 ఏళ్ల పాటు సేవలు అందించిన తురుపుముక్క మిగ్21కు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. శుక్రవారం చండీగఢ్‌లోని వాయుసేన కేంద్రం వేదికగా జరిగిన కార్యక్రమంలో ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ సహా ఆరుగురు స్క్వాడ్రన్ లీడర్లు చివరిసారి పార్టీ నిర్వహించారు. 'అద్భుతమైన ఎగిరే యంత్రంగా'.. మిగ్-21కు భారత రక్షణ రంగంలో పేరుంది. ఈ యుద్ధ విమానం 1963లో భారత వైమానిక దళంలోకి తొలిసారిగా ప్రవేశించింది. ఈ ఆరు దశాబ్దాల కాలంలో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) తన యుద్ధ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి.. 870కి పైగా మిగ్-21 విమానాలను రష్యా(పూర్వపు సోవియట్ యూనియన్) కొనుగోలు చేసింది. తక్కువ ఖర్చుతో.. బలమైన యుద్ధ సామర్థ్యం కలిగిన విమానాలుగా వీటికి పేరుంది. 1965, 1971 పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధాల్లో మిగ్-21 విమానాలు పోషించిన పాత్ర అమోఘం. 1999 కార్గిల్ యుద్ధంలో, 2019 బాలాకోట్ వైమానిక దాడుల్లోనూ ఇది కీలక పాత్ర పోషించింది. గురువారం(సెప్టెంబర్ 25) అది తన చివరిసేవలు అందించింది. గాలిలో యుద్ధ గుర్రంలా పనిచేసిన ఈ విమానం, దాని భద్రతా ప్రమాణాల్లోనూ వార్తల్లో నిలవడం విశేషం. అందుకే కొందరు దీన్ని 'ఎగురుతున్న శవపేటిక'.. అని కూడా అభివర్ణించేవారు కూడా. శుక్రవారం జరిగిన వీడ్కోలు కార్యక్రమానికి కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీడీఎస్ జనరల్ అనిల్ చౌహన్, సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది, నావికాదళ అధిపతి అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి తదితరులు హాజరయ్యారు. సూర్య కిరణ్ ఎరోబెటిక్స్ బృందంతో పాటు స్క్వాడ్రన్ లీడర్ ప్రియాశర్మ ఈ ఈవెంట్‌కు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచారు.

# ఎవరు బతకాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయి: జెలెన్‌స్కీ

**యునైటెడ్ నేషన్స్:** ప్రపంచ దేశాలన్నీ మానవ చరిత్రలో గతంలో ఎన్నడూ చూడనంతగా విధ్వంసకర ఆయుధాల రేసులో పరుగులు పెడుతున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ విమర్శించారు. ప్రస్తుతం ప్రపంచంలో ఎవరు బతికి బట్టకట్టాలన్నది ఆయుధాలే నిర్ణయిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. ఉక్రెయిన్‌పై సాగిస్తున్న యుద్ధాన్ని యూరప్ ఖండం అంతటికీ విస్తరించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పుతిన్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం మొత్తం ఏకం కావాలని పిలుపునిచ్చారు. యుద్ధాలు ఆపటంలో ఐరాస విఫలం ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలను ఆపటంలో ఐక్యరాజ్య సమితితోపాటు అంతర్జాతీయ సంస్థలన్నీ విఫలమయ్యాయని జెలెన్‌స్కీ ఆరోపించారు. ఉక్రెయిన్, గాజా, సూడాన్.. ఇలా ఏ ఒక్క యుద్ధాన్ని ఆపలేకపోయాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశాలు మనుగడ సాగించటానికి అంతర్జాతీయ చట్టాలు ఏమాత్రం ఉపయోగపడటం లేదని మండిపడ్డారు. 'స్నేహితులు, ఆయుధాలు ఉన్నవారికి తప్ప. ఇతరుల భద్రతకు ఎలాంటి హామీ లేదు' అని పేర్కొన్నారు. కలసి ఉంటే ఎంతో మార్పు తీసుకురాగలమని అన్నారు. రష్యాతో దాదాపు మూడేళ్లుగా సాగుతున్న యుద్ధంలో తమకు మద్దతుగా నిలిచిన అమెరికా, యూరప్ దేశాలకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధాన్ని ఇంకా కొనసాగిస్తూ వెళ్తున్న రష్యా తీరును ఐరాస సభ్యదేశాలన్నీ ఖండించాలని కోరారు. 'రష్యా వెంటనే యుద్ధాన్ని ఆపకపోతే.. మేము కూడా దీనిని మరింత విస్తరిస్తాం. మరింత విధ్వంసకరంగా మారుస్తాం. మొదట ఉక్రెయిన్‌పై దాడిచేసిన రష్యా.. ఇప్పుడు యూరప్ అంతటా తన డ్రోన్లను తిప్పుతోంది. రష్యా కార్యకలాపాలు ఎప్పుడు ఎల్లలు దాటాయి. జార్జియా, బెలారస్‌లాగా కాకుండా రష్యాకు జోక్యం నుంచి మాల్డోవా తనను తాను కాపాడుకుంటోంది. యూరప్ ఖండం మాల్డోవాను కూడా కోల్పోకూడదు. ఆ దేశానికి ఇప్పుడు కావాల్సింది రాజకీయపరమైన సానుభూతి కాదు. నిధులు, ఇంధన మద్దతు కావాలి' అని పేర్కొన్నారు. ప్రస్తుత యుద్ధాల్లో డ్రోన్లతోనే వేలమందిని ఎలా చంపాలో చూపిస్తున్నారని జెలెన్‌స్కీ అన్నారు. 'ఇటీవల డ్రోన్ల కారణంగానే యూరప్‌లో విమానాశ్రయాలు మూసివేయాల్సి వచ్చింది. టాక్టికల్ డ్రోన్‌ను పరీక్షించినట్లు గత వారమే ఉత్తరకొరియా ప్రకటించింది.

మహా పత్రిక
WWW.M AILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శనివారం, హైదరాబాద్ | 27-09-2025



# సీక్వెల్‌కి గ్రీన్ సిగ్నల్

బాలీవుడ్ 'క్రూ'లోకి మళ్లీ తిరిగొచ్చారట హీరోయిన్ కరీనా కపూర్. టబు, కరీనా కపూర్, కృతీ సనన్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'క్రూ'. రాజేశ్ ఎ. కృష్ణన్ దర్శకత్వం వహించిన ఈ కామెడీ డ్రామా చిత్రం 2024లో విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రనిర్మాతల్లో ఒకరైన ఏక్తా కపూర్ 'క్రూ'కు సీక్వెల్‌ను ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఈ సన్నాహాల్లో భాగంగానే కరీనా కపూర్‌ను మేకర్స్ సంప్రదించగా ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. 'క్రూ' సినిమాలో మాదిరిగానే 'క్రూ 2'లోనూ ముగ్గురు హీరోయిన్లు ఉంటారట. కాక పోతే తొలి భాగంలో నటించిన టబు, కృతీ సనన్ రెండో భాగంలో ఉండరనే విషయంపై చర్చలు జరుగుతున్నాయని బాలీవుడ్ టాక్. ఈ ఇద్దరి స్థానంలో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఇద్దరు కొత్త హీరో యిన్లు అయితే బాగుంటుందని మేకర్స్ అనుకుంటున్నారట. మరి... ఫైనల్‌గా 'క్రూ 2'లో కరీనాతో పాటు నటించే ఆ ఇద్దరు హీరోయిన్లు ఎవరు అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు.



## అవతార్-3.. మరో తెలుగు ట్రైలర్ చూశారా?

హాలీవుడ్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ విజువల్ వండర్ అవతార్. ఆ తర్వాత అవతార్-2 కూడా ఆడియన్స్‌ను కట్టిపడేసింది. దీంతో ఈ సిరీస్‌లో మూడో పార్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు కామెరూన్. అవతార్: ఫైర్ అండ్ యాష్ పేరుతో ఈ పార్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ చేసిన మేకర్స్.. తాజాగా మరోసారి తెలుగులోట్రైలర్ విడుదల చేశారు. ఈ చిత్రం డిసెంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రిలీజ్ కానుంది. తాజాగా రిలీజైన ట్రైలర్ చూస్తే జేమ్స్ కామెరూన్ విజువల్ మార్క్ అద్భుతంగా కనిపిస్తోంది. ఈ ప్రపంచంలోని విషయాలు .. నువ్వు ఊహించిన దానికంటే లోతైనవి అనే డైలాగ్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ ట్రైలర్ ఫైట్ సీన్స్ అవతార్ మూవీ ఆడియన్స్‌ను అలరిస్తున్నాయి. ఇంకెందుకు ఆలస్యం విజువల్ వండర్‌ను చూసేయండి. కాగా.. ఈ చిత్రంలో ఈ చిత్రంలో సిగౌర్నీ వీవర్, స్టీఫెన్ లాంగ్, ఊనా చాప్లిన్, క్లిఫ్ కర్టిస్, బ్రిటన్ డాల్టన్, ట్రినిటీ బ్లిస్, జాక్ ఛాంపియన్, బెయిలీ బాస్, కేట్ విన్స్లెట్ కీలక పాత్రల్లో నటించారు.

# సోషల్ మీడియాలో ట్రోలింగ్..

## ఎలా ఎదుర్కోవాలో తెలుసు



ప్రముఖ బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ ప్రస్తుతం దల్దాల్ అనే వెబ్ సిరీస్‌లో కనిపించనుంది. ఇందులో పోలీస్ అధికారి పాత్రలో మెప్పించనుంది. ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రీమియర్ కానుంది. ఈ ఏడాది మేరే హస్బెండ్ కి బీవీ చిత్రంలో మెప్పించిన బ్యూటీ.. ఇప్పుడు ఓటీటీ సిరీస్‌లతో బిజీగా ఉంది. అయితే ఇటీవల ముంబయిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్‌కు హాజరైన బాలీవుడ్ భామ మహిళలపై జరుగుతున్న ట్రోలింగ్‌పై మాట్లాడింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో మహిళలే లక్ష్యంగా ట్రోల్స్ చేస్తున్నారని.. వీటిని ఎదుర్కోవడంతో ఉమెన్స్ ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. భూమి పెడ్నేకర్ మాట్లాడుతూ.. "ట్రోలింగ్.. బెదిరింపులు.. దీన్ని మీరు ఏ విధంగా పిలిచినా.. మనం దానికి అలవాటు పడ్డాం. కానీ మహిళలను లక్ష్యంగా చేసుకున్నప్పుడు.. వాటిని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలియదు. ఎందుకంటే నాకు అంత ధైర్యం లేదు. ఇంకో మార్గం లేనందున నన్ను నేనే సర్ది చెప్పుకుంటా. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. నాపై వచ్చే ట్రోల్స్‌ను ఎలాగైనా తట్టుకోగలగనని తెలుసుకున్నా" అని తెలిపింది. సోషల్ మీడియా ఆధిపత్యం చెలాయించే ఈ రోజుల్లో జీవించడం నిరంతరం భిన్నమైన అభిప్రాయాలను తీసుకొస్తుందని తెలిపింది. నా జీవితంలో పరిస్థితులు నాకు చాలా ఎక్కువగానే నేర్పించాయని గుర్తు చేసుకుంది. తన తొలి చిత్రం దమ్ లగా కే హైషా సినిమా తన జీవితాన్ని మార్చేసిందని భూమి తెలిపింది. టీనేజ్ వయసులో ఉన్నప్పుడే హీరోయిన్ కావాలనే పెద్ద కలతో నా ప్రయాణాన్ని ప్రారంభించానని పేర్కొంది. అప్పట్లో అవకాశాల కోసం వేచి చూసేదాన్ని అని వెల్లడించింది. కానీ ఈ రోజు నా లక్ష్యంతో పాటు ఒక వ్యక్తిగా అభివృద్ధి చెందానని భూమి పెడ్నేకర్ పంచుకుంది. ఇక సినీ కెరీర్ విషయానికొస్తే భూమి చివరిసారిగా ది రాయల్స్‌లో అనే వెబ్ సిరీస్‌లో కనిపించింది.



## మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ మూవీలో

# యషిక..

తనదైన అందాలతో యువతను ఆకట్టుకునే బ్యూటీ యషిక ఆనంద్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తోన్న తాజా చిత్రం టాస్. ఈ మూవీలో తేజస్విని మరో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రంలో రత్నం మౌళి కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమాకు సగు పాండియన్ దర్శకత్వం వహిస్తున్నారు.ఈ చిత్రం షూటింగ్ ఇటీవల తమిళనాడులోని కోవెల్ పట్టిలో పూజ కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా టాస్ దర్శకుడు మాట్లాడుతూ.. 'ఇది ఒక ప్రాంతంలో జరిగే 3 హత్యల నేపథ్యంలో సాగే మర్డర్ మిస్టరీ కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు. ఆ హత్యల నేపథ్యం ఏమిటి? వాటికి నటి యషిక ఆనంద్‌కు ఉన్న సంబంధం ఏంటి అన్న అంశాలతో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథగా తెరకెక్కిస్తున్నాం. ఈ మూవీ షూటింగ్‌ను కోవెల్ పట్టి, బిరుదు నగర్, సాత్తూర్ ప్రాంతాల్లో నిర్వహించి 25 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. అదేవిధంగా చిత్రాన్ని ఈ ఏడాది చివర్లో గాని 2026 ప్రథమార్ధంలో గాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు' చెప్పారు. ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నమ్ముముందని దర్శకుడు ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా ఈ చిత్రానికి శాంతన్ అనిభజనే సంగీతం అందిస్తుండగా.. ధర్మ దురై సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఈ మూవీలో విజయ్ టీవీ ఫేమ్ యోగి ,షన్న, సంజయ్ శంకర్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని బ్లాక్ డైమండ్ స్టూడియో పతాకంపై సయ్యాద్ జాఫర్ నిర్మిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com